T. Kasturi

శ్రీమద్భగవద్గీతా
శ్రీమచ్ఛంకర భగవత్పాదాచార్య విరచిత భాష్య సమేతా
స్వామి తత్త్వవిదానంద సరస్వతి రచించిన తత్త్వప్రకాశిక (తెలుగు వివరణాత్మక అనువాదము)

సవిస్తార వ్యాసము.

శ్రీమద్భగవద్గీత ప్రస్థానత్రయములో రెండవది. ఈ ప్రస్థానము నిదిధ్యాసన ప్రస్థానముగా ప్రసిద్ధి గాంచినది. ప్రస్థాన త్రయమునకు శ్రీ శంకర భగవత్పాదులు రచించిన భాష్యములు వేదముల యొక్క పరమ తాత్పర్యమును వాస్తవముగా దర్శింపగోరు జిజ్ఞాసువులకు మార్గదర్శకములు మరియు వేదముల పరమ తాత్పర్యము అద్వయం పరబ్రహ్మము అనియు అదియును ఆత్మాభిన్నమనియును దర్శింపచేయు కరదీపికలు అనుట నిర్వివాదము. అయితే శ్రీ శంకరుల శ్రీమద్భగవద్గీతా భాష్యము ఉపనిషద్భాష్యములకంటెను, సూత్ర భాష్యముకంటెను పరిమాణములో చిన్నది అయినను అర్థగాంభీర్యము కల శైలితో కూడినది. శంకరులే ఉపోద్ఘాత భాష్యంలో గీతకు తాము సంక్షిప్త వివరణము వ్రాయుచున్నట్లు చెప్పినారు. ఆ కారణంగానే ఈ భాష్యంలోని ప్రతి పదము లోతుగా శ్రద్ధగా చేయబడిన విచారణకు గాని అంతుపట్టనంత గంభీరమైన అర్థమును తనలో ఇముడ్చుకొని యుండును. కావుననే మహాత్ములెందరో సంస్కృత భాషలో ఈ భాష్యముపై వ్యాఖ్యానములను రచించిరి. స్వామి గంభీరానందగారు, డా. A.G. వారియర్ గారు ముఖ్యముగ వారు ఆంగ్లానువాదములను రచించిరి. హిందీలో వ్రాయబడి గీతాప్రెస్ వారిచే ప్రచురింపబడిన అనువాదము కూడా కలదు. తెలుగులో ఇంతకు పూర్వము 3 అనువాదములున్నవి. వీటిలో 46 పుటల సుదీర్ఘమైన ప్రస్తావనతో, గీతాశ్లోకములకు ప్రతిపదార్థమును శంకరభాష్యమూలమును మరియు ఆ భాష్యమునకు 'బాలానందిని' అను ఆంధ్ర వ్యాఖ్యానమును జతచేసి శ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడు గారు 2001వ సం॥లో ఆర్ష విజ్ఞాన ట్రస్టు ద్వారా తమ శ్రీ భగవద్గీతా శాంకర భాష్యాంధ్ర వ్యాఖ్యానమును ప్రకటింపచేసినారు. అంతకు ముందు 1999వ సం॥లో అప్పటికే వయోవృద్ధులు, శ్రీ పుష్పగిరి మహాసంస్థానపు ఆస్థాన పండితులు అయిన శ్రీ మారిసాంబశివ శాస్త్రిగారు 22 పుటల ఉపోద్ఘాతముతో, అవసరమనిపించిన సందర్భములలో వివరణం ఇస్తూ 'తాత్పర్య ప్రకాశిక' అనే పేరుతో శ్రీ భగవద్గీతా శాంకరభాష్యమునకు విపులమైన వ్యాఖ్యానమును రచించినారు. ఈ గ్రంథం మూడు సంపుటములలో మూడు షట్కములుగా 'సాధన గ్రంథ మండలి, తెనాలి' వారిచే ప్రచురింపబడినది. శ్రీ మారిసాంబశివ శాస్త్రిగారు తమ గ్రంథమందు 'నామాట' అనే శీర్షిక క్రింద శ్రీభగవద్గీతా శాంకర భాష్యమునకు అంతకు పూర్వమే యథాతథముగా ఒక అనువాదం ఉన్నదని, కాని అది అత్యంత ప్రౌఢము అగుటచేత, సులభగ్రాహ్యము కానందున సులభగ్రాహ్య శైలిలో అనువాదము వ్రాయవలసినదిగా సాధనగ్రంథమండలి సంస్థాపకులైన శ్రీ బులుసు సూర్యప్రకాశ శాస్త్రిగారు కోరినందున తాము అనువాదము చేయ పూనితిమని వ్రాసినారు. ఈ విధముగా బహు భాషలలో శ్రీ భగవద్గీతా శాంకరభాష్యమునకు మహాత్ములచేత, గొప్ప విద్వాంసులచేత అనువాదములు రచింపబడినవి. అయితే సంస్కృత వ్యాఖ్యానములు భాష్య పంక్తులకు అర్థమును వివరించుచూ, ఆయా పండితులచేత సందర్భమును బట్టియే అయినను శాంకర సిద్ధాంతమునకు వ్యతిరేకముగానున్న సిద్ధాంతములను ఖండించుట లక్ష్యమున్నట్లు సాగినవి. ముఖ్యముగా అభినవ శంకరులుగా ప్రసిద్ధి పొందిన శ్రీ చెళ్ళంకొండ రామరాయకవి గారి భాష్యార్క ప్రకాశికా వ్యాఖ్యానము శంకరుల హృదయమునకు అద్దముపట్టినట్లున్నను ప్రధానముగా ఇది రామానుజీయ సిద్ధాంత ఖండనము లక్ష్యముగా నడచినది. ఇక ఆంగ్లములోను, హిందీలోను, తెలుగులోను వ్రాయబడిన అనువాదములలో ఆయా విద్వాంసులు తమకు ఆవశ్యకమనిపించిన సందర్భములన్నింటియందు సంస్కృత వ్యాఖ్యానకర్తల అభిప్రాయములను వివరించుచూ, ఆయా పదముల అర్థములను సమన్వయం చేసి చూపుచూ నడచినవని చెప్పుటలో సంశయమెంత మాత్రము నుండదు. కాని ఇవన్నియు అద్వైత సిద్ధాంతమును అర్థము చేసుకొనుటకు ఉపకరించినను, ఒక నిజమైన

తీవ్రమైన జిజ్ఞాస కల్గి, వేరే సిద్ధాంతముల విషయం అంతగా తెలియకున్నను అద్వైత సిద్ధాంత మందు అమిత శ్రద్ధ గల సాధకునికి "అద్వైత తత్త్వమును నేను నా అనుభవములోనికి తెచ్చుకొనవచ్చును" అనే ధైర్యము, ప్రేరణ కలిగే విధముగా వెన్నుతట్టి "ఇదిగో యిదియే శ్రీశంకరుల హృదయము. ఆచార్యస్వామి వారు చెప్పిన ఈ విషయములను నీవు ఈ విధముగా అవగతం చేసుకొని నిరంతరం నీ అనుభవంలో ఈ విధంగా విచారణ చేసుకొనుచూ సరిచూచుకొనినట్లయితే ఇప్పుడే ఇక్కడే నీవు జీవన్ముక్తుడవే" అని తెలిపే అనువాదము చాల అవసరము. సరిగా ఈ తరుణంలో సాధకుల మనోభావాలను గమనించినారా యన్నట్లు శ్రీ తత్త్వవిదానంద సరస్వతి స్వామి వారు శ్రీ భగవద్గీతా శాంకర భాష్యమునకు 'తత్త్వప్రకాశిక' అనే పేరుతో వివరణ పూర్వకమైన ఆంధ్రానువాదమును సంతరించి సాధకులకు అందించినారు.

ఈ అనువాద గ్రంథము యొక్క నిర్మాణము స్వామీజీ వారి గణితశాస్త్ర నైపుణ్యమును అనువాద సరళి వారి విజ్ఞాన శాస్త్ర వేత్తృత్వమును తెలియచేయుచున్నది. ఈ పుస్తక పరిమాణము తక్కువ పుటలలో ఎక్కువ విషయమును యిముడ్చుటకు తగినది. కాబట్టి పాఠకుడు చేతితో ఈ గ్రంథము నుంచుకొని చదువుకొనుటకు వీలగును. దీనిలో భగవద్గీతా శ్లోకము, దాని క్రింద తాత్పర్యము ఆ దిగువన పేజీ మధ్య మార్జిను యిచ్చి దానికి ఎడమవైపున భాష్యము; కుడివైపున తెలుగు అనువాదము ఈయబడినది. అక్షర పరిమాణము తగినంత ఉండి సులభముగా చదువుటకు వీలుగానున్నది. మార్జిను కూడా అర్థవంతముగా అనగా భాష్యము తక్కువ, తెలుగు వివరణ ఎక్కువ ఉన్నచోట్లలో భాష్యమునకు తక్కువ వెడల్పు, అనువాదమునకు ఎక్కువ వెడల్పు వచ్చునట్లు, అదే విధంగా భాష్యము ఎక్కువ, అనువాద భాగము తక్కువ ఉన్నచోట్లలో భాష్యమునకు ఎక్కువ వెడల్పు, అనువాద భాగమునకు తక్కువ వెడల్పు కేటాయించినారు.

మరొక ముఖ్యమైన అంశం ఏమంటే శాంకర భాష్యమును ఒక వ్యాసం మాదిరి కాకుండా, దానిలో పూర్వపక్షము ఏది? సిద్ధాంత వాక్యమేది? దానిలో కూడ సంగ్రహ వాక్యమేది? వివరణ వాక్యం ఏది? ఒక శ్లోకం అయిన తరువాత మరియొక శ్లోకమునకు అవతారిక ఏమిటి? అనేవి చాల స్పష్టంగా సైడు హెడ్డింగులతో చూపినారు. ఒకే శ్లోకములో రెండు భిన్న అంశములు చర్చించబడినప్పుడు వాటికి గల సంగతిని చూపుచూ శంకరులు ఇచ్చిన అవతారికలను కూడా ప్రత్యేకముగా చూపినారు. ఈ విధంగా పూర్వపక్ష, సిద్ధాంతాదులను ప్రత్యేకంగా చూపుట స్వామీజీ వారి యనువాదమునకే మాత్రమే చెల్లినది. అంతేకాకుండా "సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః। నిత్యా సమాసే వాక్యే తు సా వివక్షామపేక్షతే" అను కారికలో చెప్పిన రీతిని భాష్యమును చదువునప్పుడు ఎక్కడికి ఆపాలి? ఏది ఎలా విడదీసి చదవాలి? అనేది పాఠకులకు తెలిసే విధముగా అవసరమైన చోట విసంధి చేసి భాష్య పంక్తులను పొందుపరచినారు. దీనివల్ల ఈ భాష్యమును చదివినపుడు గురువుగారి వద్ద కూర్చొని ఆయన చెప్పిన భాష్య పంక్తులను చదువుచున్న అనుభూతి పాఠకునికి కలుగుతుంది.

ఇక అనువాద సరళిని చూస్తే, కేవలం పదానికి అర్థం చెప్పటం కంటే భాష్యగత భావము పాఠకునికి అందచేయుట ప్రధానముగా స్వామీజీ భావించినట్లు తెలుస్తుంది. ఉదాహరణకు 2-6-16 శ్లోక భాష్యంలో "తస్మాత్ దేహాదేః ద్వంద్వస్య చ సకారణస్య అసతః న విద్యతే భావః ఇతి, తథా సతః చ ఆత్మనః అభావః అవిద్యమానతా న విద్యతే సర్వత్ర అవ్యభిచారాత్" ఇతి అవోచామ" అని ఉన్నది. దీనికి భాషాపరంగా అర్థం వ్రాయాలంటే "అసత్తులైన దేహాదులకు కారణ సహితమయిన ద్వంద్వమునకు భావము (అస్తిత్వము) లేదు. అట్లే సత్తుకు అంటే ఆత్మకు లేకపోవుట లేదు. ఎందుకంటే ఎక్కడా దీనికి వ్యభిచారం లేదు కాన అని చెప్పియున్నాము అని చెప్పవచ్చు. కానీ స్వామీజీ కేవలం పదార్థం తెలియుట కాదు తద్భాష్యగత భావమును పాఠకులకు అందాలి అనే ఉద్దేశ్యంతో ఆ భాష్య పంక్తులను ఈ క్రింది విధంగా అనువదించారు

కావున దేహము మనస్సు మొదలైనవి, సుఖదుఃఖాది ద్వంద్వములు అసత్తులు. వాటికి స్వతంత్రమైన సత్త లేదు. అదే విధముగా సత్ అగు ఆత్మకు లేకుండుటలేదు. ఎందుకనగా సత్ సర్వ దేశ కాల పదార్థములలో దేనియందైననూ వ్యభిచరించదు." ఈ వివరణ వల్ల సాధకుడికి స్వతంత్ర సత్త లేనివి 'అసత్'లు అనియు, 'సత్' అనేది దేశకాల పదార్థములలో ఏ మార్పు చెందకుండా తనంత తానుగా స్థిరముగా ఉండేది అని అవగతం అవుతుంది. దీనిని తెలుసుకొన్న సాధకుడు 'అసత్'ను సులభంగా గుర్తించగలుగుతాడు.

స్వామీజీ అనువాదంలో సార్వత్రికంగా గోచరించే మరొక ప్రత్యేకత ఏమంటే 'ఆది'శబ్దాన్తములయ్యే పదముల వివరణ. ఏదైనా ఒక పదము 'ఆది'శబ్దంతో అంతమయితే ఆ పదంతో మొదలుపెట్టి అదే వర్గమునకు చెందిన మరికొన్ని పదాలు ఉంటాయి. ఉదాహరణకు 'శీతోష్ణాదయః' అని ఉంటే స్వామీజీ 'చల్లదనము, వేడి, సుఖము దుఃఖములు' అని వ్రాసినారు. 'మాత్రాస్పర్శా' ఇత్యాదిగా గల 2-6-14వ శ్లోకంలో భగవానుని చేతనే 'శీతోష్ణ సుఖదుఃఖములు' ఒకే వర్గమునకు చెందినవని సూచింపబడినది. (శీతోష్ణములు ఒక ద్వంద్వం, సుఖదుఃఖములు ఒక ద్వంద్వం, ఈ ద్వంద్వములు వచ్చిపోయే స్వభావము కల్గి ఉండుట అనే సమాన ధర్మము కలవి కాన ఒకే వర్గమునకు చెందినవి). దానిని బట్టియే శ్రీశంకరులు తాను 'శీతోష్ణాదీన్' అని చెప్పినారు. కాని స్వామీజీ మాత్రము 'శీతోష్ణాదయః' అని వచ్చినప్పుడల్లా "చల్లదనము, వేడి, సుఖము, దుఃఖము మొదలైనవి" అని వ్రాసినారు. దీనివల్ల సాధకులకు స్థూలంగా బాహ్యప్రకృతిలో కనపడే శీతోష్ణములను సహించినట్లే సుఖదుఃఖములను కూడా సహించవలెను. శీతోష్ణము లెట్లు వచ్చిపోయేవగుటవల్ల అనిత్యములో సుఖదుఃఖములు కూడా అదే విధముగా అనిత్యములే అనే అంశము స్పష్టంగా తెలుస్తుంది. అంతేకాదు ఒకే పదము 'ఆది'శబ్దాన్తమైనది వేరువేరు సందర్భములలో శంకరులు చెప్తే ఆ సందర్భాన్ని బట్టి ఆ వర్గమును గుర్తించేలా దానికి చెందిన మరొక పదం వేసి అనువాదం చేసినారు. 2-6-10 శ్లోకం తర్వాత 11వ శ్లోకానికి ముందు గల సంబంధ భాష్యంలో (ఈ గ్రంథంలోని 12వ పుటలో) "శోకమోహాది దోషావిష్ట చేతసాం స్వభావత ఏవ స్వధర్మ పరిత్యాగః ప్రతిషిద్ధ సేవా చ స్యాత్" అన్న భాష్య పంక్తులను అనువాదం చేయునపుడు 'శోకము మోహము క్రోధము మొదలగు వాని చేత' అని 'ఆది'శబ్దంచే 'క్రోధ' పదం కూడా ఈ వర్గమునకు చెందినది అని తెలుపుడు చేసినారు. ఎందుకంటే స్వధర్మత్యాగము, ప్రతిషిద్ధ సేవలకు పూనుకొనేలా చేసే మరొక దోషం 'క్రోధము' కనుక అట్లు చెప్పినారు. ఈ పుస్తకం యొక్క 41వ పుటలో "జ్ఞానం సాక్షాత్ శోకమోహాది సంసార హేతు దోష నివృత్తి కారణం" అన్న భాష్య పంక్తిని అనువాదం చేయునపుడు సంసారమునకు హేతువైన మరొక దోషము భయము కాబట్టి "శోకము మోహము భయము మొదలైన సంసారమునకు హేతువైన అజ్ఞానము అనే దోషమును పోగొట్టుటయందు జ్ఞానము సాక్షాత్తుగా కారణం అగుచున్నది" అని వ్రాసినారు. అట్లే 13-6-10వ శ్లోక భాష్యంలో కల "వివిక్తేషు హి దేశేషు చిత్తం ప్రసీదతి యతః తతః ఆత్మాది భావనా వివిక్తే ఉపజాయతే" అన్న పంక్తిలోని 'ఆత్మాది భావనా' అను దానికి పుల్లెల వారి అనువాదంలో ఆత్మాది చింతన అని మాత్రము, సాంబశివశాస్త్రిగారి అనువాదంలో మనస్సు ప్రసన్నమై "భగవద్ధ్యానమునకు యోగ్యత కల్గియుండును అనే భావమును తెలియచేసే వాక్యము ఉండగా స్వామీజీ ఆత్మాది భావనా ఉపజాయతే అనగా "ఆత్మ, పరమాత్మ, శాస్త్రము మొదలగు వాటి భావన

ఉత్పన్నమగును" అని వ్రాసినారు. జ్ఞాన సాధనముగా వివిక్త దేశ సేవిత్వమును చెప్పు సందర్భములో విచారణా విషయములుగా తెలుసుకొన వలసిన ఆత్మ, పరమాత్మలను, విచారణకు సహకారి యగు శాస్త్రమును 'ఆత్మాది' పదముచే చెప్పుట ఎంతయు సముచితము. అదే శ్లోక భాష్యంలో "అరణ్య నదీపులిన దేవగృహాదిః వివిక్తదేశః" అనునపుడు "అరణ్యము, నదీ తీరము, దేవాలయము, పర్వత గుహా మొదలైన జన సంచారము లేని స్థానము అని వ్రాసినారు. మరల 18-6-52వ శ్లోక భాష్యంలో "వివిక్తసేవీ అరణ్య నదీపులిన గిరిగుహాదీన్ వివిక్తాన్ దేశాన్ సేవితుం శీలం అస్య ఇతి" అనే పంక్తిని అనువదించుచూ అడవి, ఏరు వెంక ఇసుక తిన్నెలు, కొండగుహ, ధ్యానమందిరము మొదలైన జనసమ్మర్దము లేని పవిత్ర స్థానములను సేవించే స్వభావం కలవాడు అని వ్రాసినారు. మొదటి సమస్తపదములో లేని 'పర్వతగుహ' రెండవ సమస్తపదములో లేని 'ధ్యానమందిరము'లను ఆయా పదములలోని 'ఆది' శబ్దము చేత తమ అనువాదంలో సూచించి శంకరుల దృష్టిలో నున్న ఆయా పదముల ఏకవాక్యతను చూపెట్టినారు. అట్లే 2-6-10వ శ్లోకానికి తరువాత 11వ శ్లోక ముందు ఇచ్చిన సంబంధ భాష్యంలోని "హింసాది యుక్తత్వాత్ వైదికం కర్మ అధర్మాయ అనే పంక్తిని అనువదించుచూ ఆ సందర్భమునకు తగినట్లు "హింస, యజ్ఞశిష్టమగు మాంసమును భక్షించుట మొదలైన" అని వ్రాసినారు. ఇలా ఈ గ్రంథమునందు వచ్చినచోట 'ఆది' శబ్దమంతమునందు గల సమస్త పదము భాష్యములో ఉన్నను దానిని తెలుగులోనికి అనువదించునపుడు తద్వర్గమునకు చెందిన మరొక పదమును చేర్చి అనువాదము చేయుట వలన తద్గత భావము పాఠకులకు సులభముగా బోధపడునట్లు చేసినారు.

స్వామీజీ వారి 'తత్త్వప్రకాశిక'కు కల మరొక ప్రత్యేకత ఏమంటే పరమాత్మకు చెందిన మరియు శ్రోత (జిజ్ఞాసు శిష్యుడైన) యగు అర్జునునికి చెందిన ఏ నామము భాష్యములో వచ్చినా దానిని కేవలం రూఢ్యర్థంలో కాక యౌగికమైన వ్యుత్పత్తిని తెలుపుచూ అనువదించినారు. స్వామీజీ ఎప్పుడూ సాధకులు అధ్యాత్మ శాస్త్రాధ్యయనం చేయునపుడు పురాణ దృష్టిని కాక దార్శనిక దృష్టిని కలిగి ఉండవలెనని చెప్పుచూ ఉంటారు. పదములకు గల రూఢ్యర్థమును చెప్పు వ్యుత్పత్తి పురాణ దృష్టిని అనుసరించి, యోగార్థమును చెప్పు వ్యుత్పత్తి దార్శనిక దృష్టిని అనుసరించి ఉండును కాబట్టి యోగార్థము తెలుసుకొంటే కలిగే ప్రయోజనము కేవల రూఢ్యర్థము తెలిస్తే ఉండదు. 1-6-35 శ్లో॥లోని 'మధుసూదన' శబ్దమునకు మధుకైటభులనే రాక్షసులను సంహరించినవాడు అని వ్యుత్పత్తిని చెప్పి, మధుకైటభులు రాగద్వేషములకు ప్రతీకలు అని వ్రాసినారు. దీనివలన పరమాత్మ ఎవరో ఇద్దరు రాక్షసులను చంపిన వాడు అని మాత్రమే కాక జయించు శక్యము కాని మనలోని రాగద్వేషములను నశింపచేయు వాడు అని అర్థము చేసుకొనుటకు వీలగును. అట్లే 22వ శ్లో॥లో 'అచ్యుత' పదమునకు స్వరూపం నుండి చ్యుతి లేని వాడని, 'జనార్దన' శబ్దమునకు దుష్టజనులను శిక్షించు వాడని, 15 శ్లో॥లోని హృషీకేశ శబ్దమునకు ఇంద్రియాధిపతియగు పరమాత్మయని వ్రాసినారు. ఒకే పదము రెండు సార్లు లేదా 3 సార్లు వచ్చినా ఒకే సారి యోగార్థము చెప్పవచ్చు కదా! యని ఊరుకొనక ప్రతీసారి యోగార్థమును వ్రాసి పాఠకులను హెచ్చరించినారు. 'అనేకభవ ప్రధానమైన శాస్త్రముల వివరణమందు పునరుక్తి దోషము కాదు' అనే న్యాయమును అనుసరించి ఇట్లు వ్రాసినారు. ఉదాహరణకు భాష్యంలో 'వాసుదేవ' శబ్దము అనేక సార్లు వచ్చినది. దీనిని అనువదించిన ప్రతీ మారు సర్వజగత్తునకు అధిష్ఠానమైన (సత్తయైన) చైతన్య స్వరూపము (స్ఫూర్తి నిచ్చే స్వరూపము) అని తప్పకుండా వ్రాసినారు. దీనివలన వాసుదేవుడనగా వసుదేవుని కుమారుడు అనే పురాణగాథ ప్రకారం వచ్చిన రూఢ్యర్థమే కాక ఈ సర్వ జగత్తునకు సత్తాస్ఫూర్తులను ఇచ్చే పరబ్రహ్మ స్వరూపము సుమా!

యని సాధకులైన పాఠకులకు జ్ఞాపకం చేయుచున్నట్లుండి కారణ అప్రమత్తులై
గీతా శాస్త్రాధ్యయనము చేయగలందులకు వీలగును. ఈ విధముగా యౌగికమైన
అర్థమును తెలుపుట స్వామీజీ వారి అనువాదమునకు మాత్రమే చెల్లినది.

ఇక నిప్పుడు అంశముల వారీగా "తత్త్వ ప్రకాశిక" లోని కొన్ని విషయములను పరిశీలింతము.

(1) 1వ పుట మొదటి పేరా (అనువాద భాగము) :- 'అవ్యక్త' శబ్ద నిర్వచనము. "నామరూపములుగా వ్యాకరణం చెందని మాయా శక్తియే అవ్యక్తము (ఇంద్రియగోచరము కానిది.) అదియే జగత్తునకు ఉపాదానము" అని చెప్పి నారాయణుడు (పరమాత్మ) దానికంటె విలక్షణుడు. అని వ్రాసినారు స్వామీజీ. అంతియు కాక 2వ పుటలోని భాష్యంలోని నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావః అను పదమునకు అనువాదము వ్రాస్తూ "ఆయన స్వరూపముచే నిత్యుడు (కాలాతీతుడు, వికారములు లేనివాడు), శుద్ధుడు (జగత్తుతో సంగము లేనివాడు, బుద్ధుడు (జడ సంబంధము లేని చేతనుడు) అని చెప్పినారు. సాంబశివ శాస్త్రి గారేలనో ఈ సమాసమును వివరించలేదు నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వభావుడనియే వ్రాసినారు. పుల్లెల వారు 'శుద్ధః' అనగా మాలిన్యము లేని వాడనియు, 'బుద్ధః' అనగా జ్ఞాన స్వరూపుడనియు వ్రాసినారు. ఈ వివరణవల్ల సాధకులకు ఈ శబ్దముల సమగ్రమైన అర్థము స్ఫురించదు. అంతేకాక 'పరమాత్మ కూడ ఒక వ్యక్తియని అయితే ఆతడే మాలిన్యములు లేని వాడు' అనే భావం కలుగుతుంది. కాని స్వామీజీ వారు వ్రాసిన శుద్ధుడు (జగత్తుతో సంగము లేని వాడు) అన్న వివరణవల్ల ఎట్టి సంశయము లేకుండా పరమాత్మ మాయా సంగము లేని వాడు అని తెలుస్తుంది. ఎందుకంటే అవ్యక్తము ను గురించి చెప్పినపుడు మాయా శక్తియే జగత్తునకు ఉపాదానము (రొట్టెకు పిండి వంటిది) అని చెప్పియున్నారు. అంటే మాయా శక్తియే జగత్తుగా భాసిస్తోంది తప్ప వేరే జగత్తు అనేది ప్రత్యేకంగా లేదని తెలుస్తుంది. అలాగే ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు కనపడుట మాయా ప్రభావమే అని కూడా అర్థం అవుతుంది. అంతేకాక స్వామీజీ వారి ఈ వివరణ శుద్ధం అనగా మాయయా అస్పృష్టం .. అనే 'శుద్ధ' శబ్ద నిర్వచనమును స్ఫురింపచేస్తోంది. అట్లే నిత్య శబ్దమునకు స్వామీజీ వివరణ వల్ల కాలపరిధిలోకి వస్తే వికారములు (మార్పులు) ఉంటాయని, పరమాత్మ వికారములు లేని వాడనుట చేత 'సత్' స్వరూపంగా పరమాత్మ యొక్క స్వరూపమును, 'బుద్ధ' శబ్దమునకు ఇచ్చిన వివరణవల్ల 'చిత్' గా పరమాత్మ యొక్క స్వరూపమును వివరించినట్లయినది. ఈ విధంగా మంగళాచరణ శ్లోకములోనే అద్వైత తత్త్వమును తెలియజేసిన ఆచార్య శంకరుల హృదయమును 'నిత్య శుద్ధ బుద్ధ' అనే శబ్దముల వివరణ ద్వారానే చక్కగా ఆవిష్కరించినారు స్వామీజీ.

(2) ఉపోద్ఘాత భాష్యంలోని ఉన్న 'భౌమస్య బ్రహ్మణః బ్రాహ్మణత్వస్య చ రక్షణార్థం' (1వ పుటలో) అనే పంక్తిని భూలోకమందలి వేదమును, బ్రాహ్మణత్వము (వేదాధ్యయన పరంపర)ను రక్షించుట కొరకు అని అనువాదం చేసినారు స్వామీజీ. ఈ సందర్భంలో ఇతర అనువాదకులు భౌమస్య బ్రహ్మణః అనే పదములను బ్రాహ్మణత్వస్య అనే పదమునకు విశేషణంగా చేసి భూమిమీదున్న బ్రాహ్మణం అనగా బ్రాహ్మణత్వమును రక్షించుట కొరకు అని అర్థమును వ్రాసినారు. ఈ సందర్భంలో తాము ఆనందగిరి పండితుని అభిప్రాయంతో ఏకీభవించినట్లు, అదియే సరియైనదని తాము భావించుచున్నట్లు, భాష్యార్థ ప్రకాశికాకారులు 'భౌమస్య బ్రహ్మణః బ్రాహ్మణత్వస్య చ' అనే పాఠము స్వీకరించినట్లు కాని అది అంత సబబు కాదనియు వివరణ ఇచ్చినారు. అయితే భాష్యార్థ ప్రకాశికను, ఆనందగిరి పండితుని వ్యాఖ్యానమును కూడా కూలంకషముగా పరిశీలించిన స్వామీజీ తమ అనువాదములో వేదమును, వేదాధ్యయన పరంపరను రక్షించుట కొరకు వ్రాసినారు. అంతేకాక తరువాత వచ్చిన "బ్రాహ్మణత్వస్యహి రక్షణేన రక్షితః స్యాద్ వైదికో ధర్మః తదధీనత్వాత్

వర్ణాశ్రమ భేదానామ్. అన్న పంక్తికి అనువాదం చేస్తూ స్వామీజీ "ఎందుకంటే, బ్రాహ్మణత్వము (వేదాధ్యయన పరంపర) ను రక్షిస్తే వేదవిహితమైన ధర్మము రక్షించబడును. వర్ణముల - ఆశ్రమముల విభాగము వేద ధర్మమును ఆశ్రయించి ఉన్నది" అని వ్రాసినారు. ఇప్పటికూడా ఇంగిలీషులోను అనువాద పుస్తకాలలో వర్ణముల; ఆశ్రమముల విభాగము బ్రాహ్మణత్వముపై ఆధారపడి ఉన్నవి అని ఉన్నది. దీనికంటే స్వామీజీ వారి అనువాదములోని సామంజస్యమే మనగా వర్ణాశ్రమ విభాగము బ్రాహ్మణత్వముపైననే ఆధారపడి యుండే పక్షములో కేవలం దానిని రక్షిస్తే సరిపడుతుంది ఇక వేద ధర్మము యొక్క రక్షణను గురించి వేరే చెప్పవలసి ఉండదు. వాన్ని శంకరులు చెప్పారు కనుక స్వామీజీ వ్రాసినట్లు వర్ణాశ్రమ విభాగము వేద ధర్మమును ఆశ్రయించి ఉన్నది. ఆ వేద విహితమైన ధర్మము రక్షింపబడవలెనంటే బ్రాహ్మణత్వమును (వేదాధ్యయన పరంపరను) రక్షించటం ఆవశ్యకము. వేదాధ్యయన పరంపర రక్షించబడవలెనంటే భూలోకమందలి వేదమును రక్షించటం ఆవశ్యకము. ఎన్నో వేద శాఖలు ఈనాడు అధ్యయన అధ్యాపనములందు లేకుండా పోయినవని అనగా ఆ మేరకు వేదశాఖలలో చాలవరకు రక్షింపబడుట అనే ప్రక్రియా పరిధి నుండి తప్పిపోయినవి అని పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఉండుట గమనిస్తూ ఉన్నాము. అంటే వేదము యొక్క, వేదాధ్యయన పరంపర యొక్క రక్షణ కొరకై పరమాత్మ దేవకీయందు వసుదేవుని వలన అంశ (లీలా విగ్రహము, మాయామయమైన రూపము) చే శ్రీకృష్ణుడై ప్రకటమై ఆయా రక్షణల కొరకు సంవ్యవస్థను చేసినాడని తరువాతకాలము గడువగా మానవుల అజ్ఞానము కారణముగా పెచ్చు పెరిగిన భోగలాలసత వల్ల అవి మరల క్షీణదశను చేరుకొను చున్నవని తెలియుచున్నది. కాబట్టి ఈ భాష్య పంక్తులకు స్వామీజీ వారి అనువాదమే యుక్తియుక్తముగా నున్నదని చెప్పవచ్చు.

3) 2వ పుటలో కల "అర్జునాయ శోకమోహ మహోదధౌ నిమగ్నాయ" అన్న భాష్య భాగమునకు అనువదించుచూ "దుఃఖము, మోహము (అజ్ఞానము, చిత్తవైకల్యము) అనే పెద్ద సముద్రములందు మునిగి యున్న వాడని వ్రాసినారు. అనగా దుఃఖము అజ్ఞానం వల్లనే కల్గునని ఆ దుఃఖ కారణంగా కలిగిన చిత్తవైకల్యము వలన మానవుడు మోహంలో పడిపోతాడని తెలియుచున్నది.

4) 4వ పుటలో కల మొదటి భాష్యపంక్తిలో కల 'పరమార్థతత్త్వం' అనే దానికి పరమార్థమైన తత్త్వము (ఆకారము ఆరోపము లేని సత్యవస్తువు) అని వ్రాసినారు. దీని వల్ల తత్త్వము అనగా అంతరతమమైన స్వరూపమని, దాని యందు నామరూపముల ప్రసక్తి ఉండదని తెలుస్తున్నది. 'అనారోపితాకారం తత్త్వం' అనే నిర్వచనమును సప్రమాణం చేస్తూ ఈ అనువాదము సాధకులకు చక్కగా ఉపకరిస్తుంది. ఈ పదమునకు భాష్యార్థ ప్రకాశకారులచే 'పరమార్థతత్త్వం' అని ఆంగ్లానువాదములలో ultimate truth, supreme reality అనియు అర్థములు ఈయబడినవి కానీ తెలుగు అనువాదములలో ఈ మాటను ఎత్తుకొన్నట్లు కనిపించదు.

5) 12వ పుటలో 'తమిమం చ సర్వకర్మసన్న్యాసపూర్వాత్ ఆత్మజ్ఞానాత్ న అన్యతో నివృత్తిః' అనే పంక్తిని అనువదించుచూ 'సర్వకర్మసన్న్యాస (కర్తృత్వత్యాగ) పూర్వకమయిన ఆత్మజ్ఞానం తప్ప మరియొక ఉపాయం లేదు' అని వ్రాసినారు. ఇక్కడ 'సర్వకర్మసన్న్యాస' పదము వచ్చినా అది కేవలము ఆశ్రమ స్వీకారమునో, కర్మను స్థూలముగా విడిచిపెట్టుటనో తెలియచేయుట లేదని 'ఆత్మ అకర్త' అనే జ్ఞానమునందు నిలిచి యుండుటయే సర్వకర్మసన్న్యాస పదమునకు సరియగు అర్థము (129 P 5-6 ఆరంభంలోని భాష్యంలో) అని కంఠోక్తిగా తెలిపినారు స్వామీజీ. దీనివల్ల సాధక పాఠకులకు సరియైన అర్థమును తెలియచేయాలనే అంశంలో గల స్వామీజీ వారి శ్రద్ధ తెలియుచున్నది. ఈ విధమైన అనువాదం వలన సాధకులకు కేవల ఆశ్రమ స్వీకారమునందో, కర్మలను స్థూలంగా విడిచిపెట్టుటయందో కాకుండా కర్తృత్వ త్యాగమువైపునకు బుద్ధి ప్రసరించును. తద్విచారణ వలననూ, దానిని అభ్యసించుట వలననూ వారి నిత్యజీవితములో కూడ మానసిక ఆందోళనములు తగ్గిపోవునంత ప్రశాంతముగా కర్తవ్యకర్మను నిర్వహించి, ఫలాభిసంధి లేని విధముగా జీవించుట అలవడగలదు.

(6) 21వ పుటలో 2-6-16వ శ్లోక భాష్యంలో "సర్వత్ర ద్వే బుద్ధీ సర్వైః ఉపలభ్యేతే సమానా
ధికరణే. న నీలోత్పలవత్. సన్ ఘటః, సన్ పటః, సన్ హస్తీ ఇతి ఏవం సర్వత్ర" అను
సందర్భములో "అన్ని వ్యవహారముల యందు అందరికీ రెండు బుద్ధులు అనుభవానికి
వస్తున్నాయి. ఆ బుద్ధులు రెండింటికీ అధికరణము (అధిష్ఠానము) సమానము. (రెండు బుద్ధుల
విషయవస్తు నిష్ఠములు) ఇది నల్లని కలువ వంటి గుణగుణి విషయమైన సామానాధికరణ్యం
కాదు. ఉన్న ఘటము, ఉన్న వస్త్రము, ఉన్న ఏనుగు ఈ విధంగా అంతటా. (రెండు బుద్ధులు
ఉన్నాయి). (ఈ బుద్ధులన్నింటి యందు అనువృత్తమవ్వే సత్తయందు వ్యావృత్తమవ్వే
ఘటాయులు కల్పితములు అనే సామానాధికరణ్యము)" అని వ్రాసినారు. స్వామీజీ. ఈ
సందర్భంలో భాష్యార్థ ప్రకాశికాకారులు 'సామానాధికరణ్యేన' నీలోత్పలవత్' అనే
పాఠము సాధువని, ఆనందగిరి పండితులు 'సమానాధికరణే ననీలోత్పలవత్'
అనే పాఠమును స్వీకరించుటకు కారణం కన్పడదని, చాలా వివరముగా "సామానాధికరణ్యేన
నీలోత్పలవత్" అనే పాఠమునకే సాధుత్వమును తెలిపియున్నారు. కాని 'సన్ ఘటః'
మొదలగు వాటిలోని సామానాధికరణ్యము 'నీలోత్పలం' లోని సామానాధికరణ్యం
వంటిది అంటే సాధకులు సంశయగ్రస్తులై పొరబాటు పడే అవకాశం ఉన్నది. నీల
యన నీలాది గుణవాచకములు కొన్ని వస్తువులకు మాత్రమే పరిమితమైనవి. ఉత్పలము
లకు ఉన్న నీలవర్ణము మల్లెలకు ఉండదు, ఇంతియేకాక ఒకే పదార్థములోనైతము వాటి అవస్థలు
మారితే ఈ గుణములు మారును. ఉదాహరణకు గంగరావి పుష్పం వికసించినప్పుడు yellowish white
గా ఉంటుంది. అదే పువ్వు వాడిపోగానే ఎర్రగా మారును. కొన్ని వస్తువులు మరి ఒక పదార్థ సన్నిధానములో
ఈ గుణములు మారుతాయి. ఉదాహరణకు నీల వర్ణము గల పుష్పమును పసుపుపచ్చని (పారదర్శక)
కాగితం నుండి చూస్తే అది ఆకుపచ్చగా కన్పడును. కాని 'సత్' ఆ విధంగా పదార్థములను బట్టిమో,
వాటి అవస్థలను బట్టి మారునది కాదు. సర్వపదార్థములలోను, సర్వదా అనువృత్తము
అయ్యేది. కాబట్టి 'నీలోత్పలమ్', 'సన్ ఘటః' అనే పదములలో 'సామానాధికరణ్యం'
ఉండుట సమానమే అయినా రెంటిలోని సామానాధికరణ్యములకు సూక్ష్మమైన
భేదమున్నది. ఈ విధముగా సాధకులు పొరబాటు పడకుండా ఉండగలందులకే
స్వామీజీ 'సమానాధికరణే. ననీలోత్పలవత్' అనే పాఠమును స్వీకరించి అనువాదం
చేసినారు. దీనినిబట్టి 'లోకాగురుణాం గురుః' అదే సమయంలో 'వ్యాఖ్యాన కింకరో మాభూః' అని
చెప్తూ ఉండే స్వామీజీ అక్షరశః ఆ విషయములను దృష్టిలో ఉంచుకొని తమ అనువాదరచనను
సాగించినారని తెలుస్తూ ఉన్నది.

(7) 42వ పుటలో 2-6-41వ శ్లోక భాష్యంలో గల (1) "వ్యవసాయాత్మికా నిశ్చయస్వభావా ఏకా
ఏవ బుద్ధిః" (2) 'విపరీత బుద్ధి' (3) 'సమ్యక్ ప్రమాణ జనితత్వాత్' అనే పదములను స్వామీజీ
చాల చక్కగా అనువదించినారు. (1) "నిశ్చయమే స్వభావముగా గల బుద్ధి ఒక్కటియే
యుండును. (మోక్షమే ఏకైకమగు ఉద్దేశ్యముగా గల బుద్ధి)". ఈ వివరణవల్ల లౌకిక విషయ
ములకో, ధర్మమునకో చెందిన నిశ్చయం కాదు మోక్షమే పరమలక్ష్యమనే నిశ్చయము అని యు,
(2) విపరీత బుద్ధి:- 'సాంసారిక లక్ష్యములు గల బుద్ధియే విపరీత బుద్ధి (అయథార్థమైన బుద్ధి)'
ఈ వివరణవల్ల సాంసారికమైన లక్ష్యముపైపుకు బుద్ధి మళ్లినప్పుడే సాధకులు దానిని
విపరీతబుద్ధిగా గుర్తించి దానినుండి మళ్లుటకు వీలగునని, (3) "యథార్థమైన శాస్త్రమనే
ప్రమాణము (జ్ఞానసాధనము) వలన" ఈ వివరణ వలన సమ్యక్ ప్రమాణమనగా శాస్త్రమే
తప్ప వేరు కాదని, అది కూడా యథార్థమైన అనుటవలన అద్వయ సత్యవస్తువును బోధించు
వేదాంత శాస్త్రము అనే అర్థం చేసుకొనవలెనని సాధకులు గ్రహించుటకు వీలు కలుగును.

8) 43వ పుటలో 44శ్లో. భాష్యంలోకల 'వివేకప్రజ్ఞ' అనే పదాన్ని 'ఆత్మానాత్మ భేదాను

ప్రకాశింపచేసే బుద్ధిశక్తి యనియు, 44వ పుటలోని 45 శ్లో. భాష్యంలోని త్రైగుణ్య విషయాః అనే సమస్త పదంలోని త్రైగుణ్య పదమును "సత్త్వరజస్తమోగుణముల కార్యమైన సంసారమే అని అనువదించినారు. మిగిలిన వ్యాఖ్యాతలు త్రైగుణ్యం అనగా సంసారం అని మాత్రం వ్రాసినారు. ఉన్నవి సత్త్వరజస్తమోగుణములు మూడే. ఈ మూడుగుణముల కార్యమే. అంటే ఈ మూడు గుణముల కారణంగానే సంసారం అనుభవానికి వస్తుచున్నది. కాబట్టి సంసారము త్రైగుణ్యము. అట్లే అదే శ్లోకంలోని 'నిర్ద్వంద్వో భవ' అనే పదమునకు ద్వంద్వములనుండి నిష్క్రమించుము (వాటిని సహించుము) అని వ్రాసినారు. ద్వంద్వముల అనుభవమునకు రాకుండా ఉండవు. కాబట్టి అవి అనుభవంలోనికి వచ్చినప్పుడు వాటిని సహించి, వాటికి లొంగకుండా అంటే సుఖము (లేదా అనుకూల పరిస్థితులు) వచ్చినప్పుడు పొంగి పోకుండా, దుఃఖము (లేదా ప్రతికూల పరిస్థితులు) ఎదురు అయితే క్రుంగి పోకుండా ఉండుటయు సాధకుడు అలవరచుకోవలెనని తెలియుచున్నది. అదే శ్లోకభాష్యంలోని 'ఆత్మవాన్ అప్రమత్తః చ భవ' అనే మాటను "ఆత్మ (బుద్ధి) వంతుడవు అంటే జాగరూకుడవు (భోగముల యెడల సావధానుడవు) కమ్ము" అని అనువదించారు. భోగములను అంటే అత్యంత అవసరములైన క్షుత్పిపాసాపనోదకములు, శరీరాచ్ఛాదన చేయగల వస్త్రము ఇవి తప్ప మిగిలినవి అంతో ఇంతో భోగమనుకలుగ చేసేవే. కాబట్టి వాటి యెడల బుద్ధి ఆసక్తమవుచున్నదా! యని విచారించి చూసుకొనుచూ, ఆసక్తమయినచో వెంటనే గుర్తించి వాటిని నివారించుకొనుచూ ఉండాలి అనే హెచ్చరిక దీనిలో ఉంది.

(9) 50వ పుటలో 2-6-55వ శ్లోక భాష్యంలోని 'ఆత్మని ఏవ ప్రత్యగాత్మస్వరూపే ఏవ' అనే భాగాన్ని అనువదించుచూ 'ప్రత్యగాత్మ' శబ్దమునకు "దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, అహంకారములను అనాత్మలుగా గుర్తించి నిరాకరించగా మిగిలే శుద్ధ చైతన్యము ప్రత్యగాత్మ యనబడును అనే నిర్వచనమును ఇచ్చినారు. మరల 2-6-61వ శ్లోక భాష్యంలో కల 'సర్వప్రత్యగాత్మా' అను దానిని 'సకల ప్రాణులలోని అంతరతమమగు ఆత్మ చైతన్యము' అని అనువదించి పైన చెప్పిన నిర్వచనమును మరొకసారి జ్ఞప్తికి తెచ్చినారు. ఈ 61వ శ్లోక భాష్యంలోని 'యుక్తః సమాహిత స్సన్' అను దానిని అనువదించునపుడు 'సమాహిత (జాగరూకమైన, అంతర్ముఖమైన) చిత్తము కలవాడై' అని వ్రాసినారు. అంతర్ముఖమగుట అంటే బహిర్ముఖము కాకుండ ఉండుట. చిత్తము బాహ్య విషయముల నుండి వెనుకకు మరలగానే నిద్రలోకి జారిపోయేటందుకు అలవాటు పడి ఉంటుంది. అందుకనే కేవలం అంతర్ముఖమైన అని మాత్రమే కాక జాగరూకమైన అనే విశేషణమును కూడా వేసినారు స్వామీజీ. అంటే బాహ్య విషయములయందు ప్రసరించకుండా, నిద్రకు లోను కాకుండా ఆత్మచైతన్యమునందే నెలకొనియున్న చిత్తము కలిగి ఉన్నవాడై అనే భావము సాధకులకు తెలుస్తుంది ఈ అనువాదం వలన.

(10) 2-6-68వ శ్లోక (57వ పుటలోనిది) భాష్యం తరువాత 69వ శ్లోకమునకు ముందుగల అవతారికలోని 'యః అయం లౌకికో వైదికః చ వ్యవహారః' అనే పంక్తిని అనువదించుచూ లౌకిక వ్యవహారము (ధనమును సంపాదించి భోగములను అనుభవించుట), వైదిక వ్యవహారము (పుణ్యమును సంపాదించి భోగములను అనుభవించుట) అని వ్రాసినారు. ఈ వివరణ చదివిన సాధకులు లౌకిక వ్యవహారమైనా, వైదిక వ్యవహారమైనా భోగానుభవమునకే దారితీయునని గుర్తించి ఆ వ్యవహారముల నుండి సాధ్యమైనంత వరకు వైదొలగగలరు. 58వ పుటలోని (2-6-69వ శ్లోక సంబంధమైన) భాష్యంలోని "యస్యాం నిశాయాం ప్రసుప్తాః ఇవ స్వప్న దృశః సా నిశా అవిద్యా రూపత్వాత్ పరమార్థతత్త్వం పశ్యతో మునేః" అనే భాగాన్ని "ఏ (అజ్ఞానమనే) రాత్రి యందు జనులు నిద్రిస్తూ కలలను కంటున్నారో, అది (భేదముతో నిండిన లోక వ్యవహారము) పరమార్థమైన ఆత్మ తత్త్వము నరయుచున్న మననశీలుడగు యోగికి రాత్రి. ఎందుకంటే ఆ లోకవ్యవహారము అజ్ఞాన రూపము" అని సముచితంగా అనువాదం చేసినారు. దీనివల్ల భేదముతో నిండిన లోకవ్యవహారమందు యోగి (ఆత్మతత్త్వ జిజ్ఞాసువు) ప్రవృత్తుడు కాడు (కారాదు) అని తెలుస్తోంది.

(11) 65వ పుటలో గల (వివరణము) భాష్యంలోని 'ఏకస్య పురుషస్య జ్ఞానకర్మణోః విరోధాత్ యుగపద్ అనుష్ఠానం న సంభవతి ఇతి భిన్న పురుషానుష్ఠేయత్వం భగవతా పూర్వమ్ ఉక్తం స్యాత్'. అనే పంక్తులను "ఒకే వ్యక్తి పరస్పర విరుద్ధములైన జ్ఞానకర్మలను కలిపి అనుష్ఠించుట సంభవము కాదు గనుక, వాటిని వేరువేరు వ్యక్తులు అనుష్ఠిస్తారు (లేదా ఒకే వ్యక్తి ముందు కర్మను, తరువాత జ్ఞానమును భిన్న కాలములలో అనుష్ఠిస్తారు.)" అని అనువదించినారు. దీనిలో కుండలీకరణములలో ఇచ్చిన వివరణ ఈయకపోతే ప్రస్తుతం కర్మానుష్ఠానం చేస్తున్న జ్ఞానమునందు శ్రద్ధగల సాధకుడు జ్ఞానకర్మలు వేరువేరు వ్యక్తులు అనుష్ఠించదగినవియా మరి నేను జ్ఞాన సముపార్జనకు తదనుష్ఠానమునకు తగనా! అని నిరాశ పడే ప్రమాదమున్నది. ఇపుడు స్వామీజీ వ్రాసిన సమన్వయ పూర్వకమైన భావపూరణ రూపమైన వాక్యం వల్ల అదే సాధకుడు ఇపుడు నేను కర్మానుష్ఠానంలో ఉన్నా దీనిని కర్మయోగంగా మలచుకొని జ్ఞానమును (శ్రవణ మననముల ద్వారా) పొంది జ్ఞాననిష్ఠుడను కాగలను అనే ధైర్యమును పొందగలడు.

(12) 67వ పుటలో 3-6-3వ శ్లోక భాష్యంలోని 'అభ్యుదయ నిశ్శ్రేయస ప్రాప్తి సాధనం' అను పంక్తిలోని అభ్యుదయ పదమునకు 'ఇహపరములయందు భోగానుభవము' అని అర్థము వ్రాసినారు. అంటే ఈ లోకంలో లౌకిక కర్మలను ఆచరించిన ఫలితంగా పొందిన ధనకనక వస్తువాహనాదులు కదా అభ్యుదయం అంటే వీటియందు నాకు కోరిక ఏమీ లేదు ఇక పుణ్యకార్యములు చేస్తాను అనుకొనే సాధకునికి "ఓయీ! నీ లక్ష్యమేమి? మోక్షమే నీ లక్ష్యమైనచో నీవు సకామంగా ఈ పుణ్యకర్మలను చేస్తే వాటికి ఫలమైన స్వర్గాదుల కోరిక అభ్యుదయశబ్దం చేతనే చెప్పబడుతుంది. కాబట్టి నీవు దీనిలో కూడా సక్తుడవు కారాదు" అనే హెచ్చరిక చేయబడినట్లు అవుతుంది.

(13) 73వ పుటలో 3-12 శ్లోక భాష్యంలో "తైః దేవైః దత్తాన్ భోగాన్ అప్రదాయ అదత్వా ఆనృణ్యం అకృత్వా ఇతి అర్థః" అనే భాగాన్ని "ఆ దేవతలచే ఈయబడిన భోగములను ఈయకుండా - అంటే దేవతలకు (యజ్ఞముచే), పితరులకు (సంతానముచే), ఋషులకు (వేదాధ్యయనముచే) ఋణమును తీర్చకుండా అని అర్థము" అని అనువదించారు. దీనివలన మానవుడు సహజముగా ఎవరెవరికి ఋణపడి ఉన్నాడో, దేనిచే ఆయా ఋణములను తీర్చుకొనగలడో తెలుస్తున్నది.

(14) 77వ పుటలో 3-6-18 శ్లోక భాష్యంలోని 'అర్థవ్యపాశ్రయః' పదమునకు 'ప్రయోజనము కొరకై చేసే కీర్తనము, వందనము మొదలైన క్రియచే సంపాదించదగిన ఆశ్రయము అర్థవ్యపాశ్రయము' అనే వివరణము వ్రాసినారు. 82వ పుటలో 3-6-29 వ శ్లోక భాష్యంలోని 'గుణకర్మసు' అనే పదమునకు 'గుణముల కర్మలయందు (గుణకార్యములైన దేహేంద్రియ వ్యాపారములయందు)' అనే వివరణము నిచ్చినారు. 85వ పుటలో 3-6-36 వ శ్లోకమునకు పూర్వమందు గల అవతారికలోని 'అనర్థమూలం' అనే పదమునకు "అనర్థము (సంసారములో పడిపోవుట) నకు మూలము (కామన)" అని వివరణమును వ్రాసినారు. దీనివలన సంసారములో పడిపోవుట కంటే అనర్థము వేరే ఏదియు లేదని, దానికి మూలము కామన తప్ప మరే ఏదియు కాదని తెలుసుకొని కామనలు లేకుండా ఉండుటకు, కనీసం వాటిని బాగా తగ్గించుకొనుటకైనా (ప్రారంభంలో) ప్రయత్నించవలెను. 86వ పుటలో 37వ శ్లోక భాష్యంలోని 'మహాశనః' అనే శబ్దమును వివరించుచూ 'కామనకు ఆకలి చాలపెద్దది గనుక అది మహాశనము అనబడును (విషయములను భోగించుటయే కామనకు ఆహారము)' అని వ్రాసినారు. విషయములను భోగించుటకు కడంగినచో ఆలాలస తపెరిగి పోవునే కాని తగ్గదు కావుననే కామన యొక్క ఆకలి పెద్దది అని చెప్పుట కుదిరినది. 88వ పుటలో 40వ శ్లోక భాష్యంలోని 'వివిధం మోహయతి' అనే దానిని "అనేక విధములుగా మోహపెట్టుచున్నది (అనాత్మను ఆత్మగా భావించుట ఇత్యాది మోహము)" అని మోహం యొక్క స్వరూపమును తెలిపినారు. దైనందిన జీవితంలో కూడా ఏ విషయమందు మోహపడినా (దానిని తీవ్రముగా కోరుకున్నా) ఆ విషయమందలి అశాశ్వతత్వము, అనర్థత్వము గుర్తించకుండా దానితో తాదాత్మ్యమును

చెందుట (అనాత్మలైన అవిషయములను ఆత్మగా భావించుట) కారణంగానే జరుగును అనే విషయమును గుర్తింప చేసినారు.

(15) 90వ పుటలో 4వ శ్లోక భాష్యంలోని 'సమ్యగ్దర్శన నిష్ఠాలక్షణాన్య' అనే పదమును "సమ్యగ్దర్శనము (అనాత్మను అనాత్మగా దర్శించుట, సర్వమును బ్రహ్మగా దర్శించుట) నందు దృఢముగా నిలిచి యుండుట అనే రూపంలో ఉంటుంది" అని అనువాదం చేసినారు. ఈ 'సమ్యగ్దర్శన' శబ్ద నిర్వచనము సాధకులకు చాల ఉపయోగకరము. అట్లే 91వ పుటలో 14వ శ్లోక భాష్యానువాదములో 'అహంకారము' ('నేను చేస్తున్నాను' అనే కర్తృత్వబుద్ధి) అని 'అహంకార' శబ్దమునకు, 'నేను సుఖిని, దుఃఖిని అనే అంతఃకరణ తాదాత్మ్యం కలవాడే సంసారి' అని 'సంసారి' శబ్దమునకు స్వామిజీ చెప్పిన నిర్వచనములు కూడా అత్యంతోపకారకములు.

(16) 99వ పుటలో 18వ శ్లోక భాష్యంలోని "సర్వః ఏవ క్రియాకారకాది వ్యవహారః అవిద్యాభూమౌ ఏవ" అనే పంక్తిని అనువదించుచూ 'క్రియ మరియు కర్త మొదలైన కారకములు అనే వ్యవహారమంతయు అజ్ఞానావస్థ (దేహేంద్రియాదులను ఆత్మగా భ్రమించుట) యందు మాత్రమే ఉంటుంది. ఆ వ్యవహారము పరమార్థముగు ఆత్మ తత్త్వమును స్పృశించనే లేదు' అని వ్రాసినారు. ఈ వివరణము సాధకులకు చాల ఉపయోగకరముగానుండును.

(17) 102,103 పుటలలో 18వ శ్లోక భాష్యంలోనే వచ్చిన మిథ్యాజ్ఞాన శబ్దమునకు తప్పుగా తెలియుటమే అని మిథ్యాజ్ఞానము వలన లేనిది ఉన్నట్లుగా కనపడును అని వివరణము వ్రాసినారు. ఇక్కడనే కాక మిథ్యాజ్ఞాన శబ్దము వచ్చిన చోట్లన్నింటిలోను భ్రాంతిజ్ఞానము, తప్పుగా తెలిసేది అని వివరించినారు. శాంకర భాష్యమునకు వ్రాయబడిన ఇంగ్లీషు వాదములలో కూడా ఒక దానిలో Erroneous cognition అని మరియొక దానిలో False perception అని ఈయబడినది. కాని ఏలనో ఆంధ్ర భాషలోని అనువాదములలో మిథ్యాజ్ఞాన శబ్దమునకు ఏ విధమైన అర్థము ఈయబడలేదు. అసలు బ్రహ్మసూత్ర భాష్యమునకు ముందు ఉండే అధ్యాస భాష్యములోని 'మిథ్యాజ్ఞాన' శబ్దము యొక్క విగ్రహ వాక్యమును గురించి (మిథ్యయైన జ్ఞానం అనియా మిథ్యయైన అజ్ఞానం అనియా) ఏ విధంగా చెప్పాలి? అనేది పండితలోకంలో పెద్ద చర్చ. స్వామీజీ చాల చక్కగా సందేహములే లేకుండా 'తప్పుగా తెలియుట' అని చెప్పినారు. తెలియుట అనగా జ్ఞానము. అది ఎలా తెలుస్తోంది లేనిది ఉన్నట్లుగా (లేనిది ఉన్నట్లు కన్పడుట, ఉన్నది ఉన్నట్లుగా కన్పడకపోవుటయే మిథ్య యనగా) అనగా మిథ్యగా తెలుస్తోంది. లేని జగత్తు ఉన్నట్లు తెలుస్తోంది. సర్వత్ర సర్వదా ఉన్న 'సత్' గుర్తింపబడుటలేదు. అంటే మొత్తము లౌకిక, వైదిక వ్యవహారమంతయూ అంటే అభ్యుదయ సాధనముగా వేదాన వున్న చేయబడు సర్వవ్యవహారము మిథ్యాజ్ఞాన ప్రయుక్తమే అని సాధకుడు గుర్తెరిగి తద్భిన్నమైన యథార్థమైన ఆత్మతత్త్వజ్ఞానము నరయుటకు శ్రద్ధను పూనగలడు ఈ వివరణవల్ల. అసలు స్వామీజీ 4-6-18వ శ్లోక భాష్యమునకు వ్రాసిన అనువాదమంతయు సాధకునికి (సాధకుడైన జిజ్ఞాసువునకు) అనేక సంశయములను తొలగించుకొనుటకు ఉపయోగపడును.

(18) 105వ పుటలో 4-అ-19వ శ్లోక భాష్యంలోని 'లోకసంగ్రహార్థం పూర్వవత్ కర్మణి ప్రవృత్తః అపి న ఏవ కించిత్ కరోతి' అనే పంక్తిని "లోకసంగ్రహము కొరకు జ్ఞానోదయమునకు పూర్వమునందు వలెనే కర్మలను చేయుచునే యున్ననూ, అతడు కర్మలను చేయుట లేదు (కర్తృత్వ భోక్తృత్వములు లేకుండా చేసిన కర్మ కర్మయే కాదు)" అని అనువదించినారు. దీని వలన మహాత్ములు వీడిన కర్మ ఆచరించినట్లు కన్పడితే అది మామూలు సంసారి ఆచరించే కర్మవంటిది కాదని వారు అహంకారముతో ఫలాకాంక్షతో అది చేయుట లేదని పేరు, ప్రతిష్ఠల గురించి పట్టించుకొనుట మొదలగు వాని యందు కూడా ఆసక్తి లేకుండా ఇతరులకు జిజ్ఞాసువులకు లేదా నిజమైన ఆసరా కావలసిన వారికి ప్రయోజనం చేకూర్చుటకై మాత్రమే చేయుచున్నారని సాధకుడు గుర్తించవలెననే తెలియజేయు హెచ్చరిక ఉన్నది. 120వ పుటలోని 37వ శ్లోక భాష్యంలోని 'జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్ కురుతే తథా। నిర్బీజీ కరోతి' అనే వాక్యములను 'జ్ఞానమనే అగ్ని సకలకర్మలను బూడిదగా చేసివేయును. అంటే ఆ కర్మలకు బీజమైన అజ్ఞానమును నశింపచేయును (అజ్ఞానము నశించగా కర్తృత్వభ్రమ తొలగి, కర్మలకు ఫలములను ఉత్పత్తి చేసే శక్తి నశించును

అర్థము)' అని వివరించినారు. జ్ఞానం వల్ల కర్మలు నశించే విధానమును చాల సుకరముగా తెలు
వివరణ తెలియ చేస్తోంది.

19) 5-4-1వ శ్లోకానికి పూర్వం శంకరుల చే ఈయబడిన విపులమైన భాష్యమునకు స్వామీజీ వారి అనువాదము సాధకులైన జిజ్ఞాసువులకు చాల సంశయములను తొలగించే విధముగా ఉన్నది. దీనిలో 128, 129 పుటలలో ఆత్మజ్ఞానికి కర్మయోగము అసంభవము అను టీకా మొత్తంపూర్తి ఎందుకని చాల సుబోధకముగా వివరించినారు. ఈ భాష్యములోనే అనేకమార్లు వచ్చిన మిథ్యా జ్ఞాన శబ్దమును ప్రతీచోట విసుగు చెందకుండా జిజ్ఞాసువులైన సాధకుల మీద గల అత్యంత ప్రేమతో, వాత్సల్యంతో, ఆత్మీయతతో మిథ్యాజ్ఞానమనగా తప్పుగా తెలియుటయే, దేహేంద్రియములయందు ఆత్మభావన చేయుటయే అని నొక్కి చెప్పినారు. అంతేకాక ఆత్మజ్ఞానం లేనివాడు చేసే కర్మసన్న్యాసమును 'సన్న్యాసమును స్వీకరించుట' యని, ఆత్మజ్ఞాని చేసే సర్వకర్మసన్న్యాసమును 'ఆత్మ అకర్త అనే జ్ఞానమునందు నిలిచియుండుట' యని వివరించి సాధకులకు ఎంతో మేలొనరించినారు. దీనివల్ల కేవలము సన్న్యాస స్వీకారం చేసినయంత నిజమైన కర్మసన్న్యాసం కాదని, సన్న్యాసాశ్రమము స్వీకరించక కున్నా యదార్థముగా ఆత్మ కర్త కాదు అనే జ్ఞానములో నిలచియుండి, కర్తృత్వ భోక్తృత్వములను నిజముగా విడనాడినచో అదియే వాస్తవమైన సన్న్యాసమని కాబట్టి కర్తృత్వభోక్తృత్వములను విడనాడుట అభ్యసించవలెనని సాధకులను హెచ్చరించి నట్లయినది.

20) 134వ పుటలో 5-6-7వ శ్లోక భాష్యంలో గల 'సర్వభూతాత్మభూతాత్మా' అనే సమస్త పదమును స్వామీజీ చాల చక్కగా వివరించినారు. ముఖ్యముగా ఈ సందర్భంలో వచ్చిన 'ప్రత్యక్చేతనః' అనే పదమును "దేహముతో మొదలుపెట్టి కర్మ-జ్ఞానేంద్రియములు, మనస్సు, బుద్ధి, అహంకారము అను వాటిని అనాత్మలుగా గుర్తించి నిరాకరించగా మిగిలి ఉండే శుద్ధచైతన్యము" అని అనువదించినారు. ఈ వివరణ సాధకులకు చాల ఉపయోగకరము. ఎందుకనగా ప్రత్యగాత్మ, ప్రత్యక్చేతన అనే పదముల అర్థమును సరిగా అవగతము చేసుకొనలేక సాధకులు చాల సతమతమగుచూ ఉంటారు వారికి ఈ వివరణ సంశయ విచ్ఛేదము చేయగలదు.

21) 137వ పుటలో 5-6-13 శ్లోక భాష్యంలో కల 'త్యక్త్వా హ్యాత్మనః కాయచేష్టాః' అన్న పదమునకు "వాగింద్రియము (అధిక భాషణము), మనస్సు (నిరంతరమగు వృత్తి ప్రవాహము), దేహము (అనావశ్యకముగం పనులు) ల వ్యాపారములను విడిచిపెట్టిన వారు (వాటి యందు అహం- మమ- అభిమానము లేని వాడు)" అని వివరణను ఇచ్చినారు. ఈ వివరణవల్ల ఆత్మనః కాయచేష్టలను విడిచిపెట్టుట యందలి తత్త్వము అవసరమునకు మించి వి-చేష్టయు చేయరాదని, చేసిన (తప్పనిసరిగా చేసిన) చేష్టల యందు కూడా అహంకార మమకారములు ఉండరాదని తెలియుచున్నది.

22) 149, 150, 151 పుటలలో గల 6వ అధ్యాయ ప్రారంభమునందున్న శంకరుల సంబంధ భాష్యమునకు స్వామి వారి అనువాదము సాధకులకు వచ్చు సూక్ష్మమైన సంశయములను పోగొట్టే విధముగానున్నది. 155వ పుటలో 6-4-3వ శ్లోక భాష్యములో శంకరుల చే పేర్కొనబడిన మహాభారత శాంతిపర్వాంతర్గతమగు

"నైతాదృశం బ్రాహ్మణస్యాస్తి విత్తం యథైకతా సమతా సత్యతా చ।
శీలం స్థితిర్దండనిధానమార్జవం తతస్తతశ్చోపరమః క్రియాభ్యః॥" అను శ్లోకమునకు స్వామీజీ వారు "బ్రాహ్మణునకు (బ్రహ్మజిజ్ఞాసువునకు) ఇటువంటి సంపద (పురుషార్థ సాధనము) లేదు. ఎటువంటిదంటే, ఏకత్వము (సర్వమునందు ఒకే ఆత్మను దర్శించుట), (ద్వంద్వముల మొదల) సమత్వము, సత్యవాక్పరిపాలనము, మంచి నడవడి, స్థిరత్వము (జ్ఞానమార్గమునందు జారిపోకుండా నిలుచుట), మనోవాక్కాయములను స్వాయత్తము చేసుకొనుట (లేదా అహింస), ఋజుబుద్ధి (వక్రబుద్ధి లేకుండుట), ఆయా క్రియలనుండి (క్రమముగా) నివృత్తుడగుట" అని వివరణను ఇచ్చినారు. దీనిలోని ప్రతిపదము ఎంత విలువైనదో

ఎంత శ్రద్ధతో అలవరచుకొనవలసినదో తెలియచేస్తోంది ఈ వివరణము.

(23) 157వ పుటలో 6-6-5వ శ్లోక భాష్యంలోని 'యః అన్యః అపకారీ బాహ్యః శత్రుః సః అపి ఆత్మ ప్రయుక్తః ఏవ' అనే పంక్తిని "బయట నుండే శత్రువైన ఏ యితర వ్యక్తి గలడో, అతడు కూడా తాను (అహంకార మమకారములతో) తయారు చేసుకొన్న వాడే" అని అనువదించినారు. అంటే మన అహంకార మమకారములే మనకు ఒక వ్యక్తిని శత్రువుగా చేస్తాయి తప్ప శత్రువనేవాడెవడూ వాస్తవముగా ఉండడు. బాహ్యపరిస్థితులు కూడా ఒక వ్యక్తిని శత్రువుగా చేయవు అని తెలుస్తోంది. 159వ పుటలో 10వ శ్లోకంలోని 'అపరిగ్రహః' అనే శబ్దమునకు 'పరిగ్రహము (భోగసాధనములను ప్రోగు చేయుట) లేనివాడు' అని అర్థము వ్రాసినారు. పరిగ్రహ చేయకూడదు అని ఒక్కసారి నిశ్చయించుకొంటే భోగ సాధనములను చేర్చుకొనుట తగ్గించుకోవాలి. అంటే సాధనముల యెడల భోగదృష్టిని పూర్తిగా పోగొట్టుకోవాలి అని తెలుస్తున్నది ఈ వివరణ వలన.

24) 160వ పుటలో 6-6-13వ శ్లోక భాష్యంలో గల "స్వం హి స్వనాసికాగ్ర సంప్రేక్షణమ్ ఇవ విధిత్సితమ్. కిం తర్హి? చక్షుషోః దృష్టి సన్నిపాతః. స చ అంతఃకరణసమాధానాపేక్షః వివక్షితః. స్వనాసికాగ్ర సంప్రేక్షణమ్ ఏవ చేద్వివక్షితం మనః తత్ర ఏవ సమాధీయతే న ఆత్మని. ఆత్మని హి మనసః సమాధానం వక్ష్యతి 'ఆత్మసంస్థం మనః కృత్వా' (6-25) ఇతి. తస్మాత్ ఇవశబ్దలోపేన అక్ష్ణోః దృష్టిసన్నిపాతః ఏవ సంప్రేక్ష్య ఇతి ఉచ్యతే." అనే వాక్యములను "ఎందుకంటే, ఇక్కడ తన ముక్కు కొనను చూచుటను విధించుట భగవానుని అభిమతము కాదు. మరి యేమి? రెండు కళ్ళ యొక్క చూపు కలియుట (రూపముల వైపుకు పోకుండుట). అట్టి కలయిక చిత్తము యొక్క ఏకాగ్రత దృష్ట్యా అపేక్షితము. అదియే భగవానుని అభిమతము. తన ముక్కు కొనను బాగా చూచుటయే భగవానుని అభిమతమైనచో, మనస్సు అక్కడనే ఏకాగ్రమగును గాని, ఆత్మ (స్వరూపము) యందు కాదు. ఎందుకంటే 'మనస్సును ఆత్మయందు విలీనం చేసి' అంటూ భగవానుడు మనస్సును తన స్వరూపమునందు ఏకాగ్రము చేయుటను గురించి చెప్పబోతున్నాడు. కావున, ఇవ అనే పదము లోపించినది. రెండు కళ్ళ యొక్క చూపుల కలయికయే 'సంప్రేక్ష్య' అని చెప్పబడుచున్నది". అని అనువాదం చేశారు. 'సంప్రేక్ష్య' అనే పదంచేత "చక్షుషోః దృష్టి సన్నిపాతః ఏవ వివక్షితః" అని అవగతం చేసుకొనవలెనని శంకరులు చెప్పినారు. దృష్టి సన్నిపాతః అంటే 'రెండు కళ్ళ చూపు కలియుట' అని వ్రాశారు స్వామీజీ. కాని ఒక అనువాదకులు 'క్రిందికి చూపును వంచుట' అని వ్రాశారు. వీరి అభిప్రాయం ప్రకారం నాసికాగ్రం అనే మాటకు ముక్కు యొక్క రెండు ద్వారాలపైన ఉన్న ముక్కు యొక్క ఎత్తైన భాగం అయి ఉండవచ్చు. కాని శంకరుల అభిప్రాయం 'దృష్టి సన్నిపాతః' అని వ్రాస్తూ 'సంప్రేక్ష్య నాసికాగ్రం' అంటే భ్రూమధ్యమును (ముక్కు యొక్క పై కొనను) చూచుట అయి ఉంటుంది. ఎందువల్ల ననగా 147వ పుటలో 5-6-27వ శ్లోకంలో 'చక్షుశ్చైవాంతరే భ్రువోః' (చూపును రెండు కనుబొమల నడుమ నిలిపి) అని భగవానుడే చెప్పియున్నాడు. అంతేకాక దాని తరువాతి (28వ) శ్లోకంలో "యతేంద్రియ మనోబుద్ధిః మునిః మోక్షపరాయణః" (వశమై లోబరచుకొనబడిన ఇంద్రియములు, మనస్సు, బుద్ధి కలవాడై మోక్షమే పరమ లక్ష్యముగా గలవాడై) అంటూ కూడ చెప్పినాడు. అంటే చూపును భ్రూమధ్యమునందు నిలుపుట చిత్తము యొక్క (లేదా అంతఃకరణము యొక్క) ఏకాగ్రత దృష్ట్యా అపేక్షితము అని భగవద్వచనముగా తెలుస్తోంది. అంటే రెండు కళ్ళ యొక్క చూపుల కలయిక అన్నదే 'దృష్టిసన్నిపాతః' అనే పదమునకు సరియగు అర్థమని, రెండు కళ్ళ యొక్క చూపు కలసినప్పుడే చూపు భ్రూమధ్యమునందు నిలిచి చిత్తము ఏకాగ్రమగునని తెలియుచున్నది. కావున స్వామీజీ వారి ఈ వివరణము ధ్యానము చేసే పద్ధతిలోని సూక్ష్మమైన అంశమును సయితము సాధకులకు సంశయరహితముగా బోధపరచుచున్నది. అంతేకాక గ్రంథరచనలోని వాక్యతను చెడకుండా నిర్వహించు నైపుణ్యమును చాటిచెప్పుచున్నది.

(25) 166 పుటలో 26వ శ్లోక భాష్యమును అనువదించుచూ 'మనస్సు చెదిరి పోవుటకు హేతు
వైన శబ్దము-రూపము మొదలైన నిమిత్తముల యొక్క యథార్థతత్త్వము (వినాశి, కేవలము
నామరూపముల మాత్రమే) ను పరిశీలించుట ద్వారా అది ఆభాస (ఉత్త నీడ తప్ప
యథార్థము కాదు) అని తెలుసుకొని, దానికి వైరాగ్య భావన తోడు చేసి, ఈ మనస్సును
ఆత్మయందే వశమగునట్లు చేయాలి' అంటే మనస్సు తన స్వరూపమునకు వశమగునట్లు
చేయాలి'. అని వ్రాసినారు. దీని వలన విచారణ ద్వారా మనస్సును ఆత్మస్వరూపమునందు
విలీనం చేసే విధానము తెలియుచున్నది. 169వ పుటలోని 6-6-31 శ్లోక భాష్యానువాదములో
'వైష్ణవపరమ పదము' ను 'విష్ణువునకు అంటే వ్యాపకపరమాత్మకు చెందిన, సర్వము తానే
అయిన, సర్వోత్తమమగు ప్రాప్యము, జీవన్ముక్తి' అని వివరించినారు. దీని వలన వైష్ణవపరమ
పదము అనగా అది ఒక ప్రదేశమని దానియందు విష్ణుదేవుడు (ఒక నామరూపములు గల పరి
చ్ఛిన్నమైన ఒక అవతారమూర్తి) కొలువై ఉంటాడు అనే అసమంజసము, అర్థరహితము
అయిన భావనలు నిరాకరింపబడే వీలుంటుంది సాధకులచేత.

(26) 174 పుటలో గల 6-6-44వ శ్లోక భాష్యమును చాలా చక్కగా అనువదించినారు. ఈ అను
వాదం సాధకులలో ఒక ధైర్యమును పెంచును. ఎలయనగా 6-6-40వ శ్లోకములో
యోగసాధనను చేయువాడు ఎవడైనా నికృష్టమైన గతిని పొందడు అని చెప్పి భగవానుడు
తర్వాతి శ్లోకములలో యోగభ్రష్టుని గతిని చెప్పుచూ ప్రస్తుత జీవునికి గడచిన దేహము
నందలి బుద్ధి (యోగసంస్కారము, లేక జ్ఞానము) తోడి కలయిక ఎట్లు సంభవమగును?
(అనే ఆశంకను లేవదీసి) అన్నచో దానికి సమాధానముగా 'పూర్వాభ్యాసేన' ఇత్యాది (44వ శ్లో
గల శ్లోకమును చెప్పినాడు. దీనిని వివరించుచూ శంకరులు వ్రాసిన భాష్యమును అనువాదం
చేస్తూ 'యోగభ్రష్టుడు అవశుడైనప్పటికి (పూర్వ దేని వాసనా బలము చే యోగమును కోరకున్నను)
యోగసాధనలో ముందుకు కొనిపోబడును'. అని 'యోగసంస్కారము కంటె బలీయమైన అధర్మము
చేయబడినచో ఆ అధర్మము క్షయము కాగానే యోగమునందు పుట్టిన సంస్కారము తనంత
తానుగా కార్యమును ఆరంభించును. (యోగభ్రష్టుని యోగాభ్యాసములో ముందుకు కొనిపోవును)
అనగా యోగసంస్కారము (ప్రకటము కాకుండా) చాలా కాలము (దాగి) ఉన్నను దానికి నాశము
లేదు అని అర్థము" అని వ్రాసినారు. ఈ అనువాదము సాధకుని వెన్నుతట్టి నిర్మల చిత్త
శుద్ధితో జ్ఞానము వైపు ఒక్క అడుగు వేసినా అది వ్యర్థము కాదు. శ్రేయో మార్గములో
నిన్ను తప్పనిసరిగా ముందుకు తీసుకొని పోవును అని చెప్పుచున్నట్లున్నది.

(27) 187వ పుటలో 7-6-22 వ శ్లోక భాష్యంలో కల "హితాన్ ఇతి పదచ్ఛేదః హితత్వం
కామానాం ఉపచరితం కల్ప్యమ్" అనే వాక్యమును అనువదించుచూ స్వామీజీ
హితములైన కామనలు అనే మాట ఉపచారము (హితము కాకున్నా హితముగా కల్పించి
హితత్వము నారోపించి చెప్పినమాట) అని, అదే శ్లోకానువాదంలో చివర కోరికలు (భోగ్యములు)
ఎవని (శ్రద్ధావంతునికైననూ హితకరములు కావు అని వ్రాసినారు. దీని వలన శ్రద్ధ లేని
వాడు కోరికలను తీర్చుకొనుచూ వాటి వల్ల తనకు హితము చేకూరునని భావిస్తాడు. అదే
శ్రద్ధావంతుడైతే భోగ్యములు హితకరములు కావని గుర్తించి కామనా విరహితంగా జీవి
తాన్ని మలచుకొనుటకు ప్రయత్నిస్తాడు. అని తెలియుచున్నది.

(28) 189వ పుటలో గల 26వ శ్లోక భాష్యంలోని 'మచ్ఛరణామేకం మత్వా' అనే భాగాన్ని
అనువదిస్తూ 'నన్ను శరణు జొచ్చిన నాభక్తుని ఒక్కనిని (అంతే మాత్రము అని
యర్థము, సంఖ్య కాదు) వినహాయించి' అని వ్రాసినారు. దీనిని చూస్తే సాధకుల
ఏ చిన్న విషయములోను పొరబాటు పడరాదు అనే స్వామి వారి ఉద్దేశ్యము చక్కగా
తెలియుచున్నది. 'నా భక్తుని ఒక్కనిని' అంటే నాభక్తులలో ఒకరిని అని అర్థం చేసు
కుంటారేమో అది సరికాదు నాభక్తుని మాత్రమే అని అర్థం చేసుకోవాలి ఆపదాన్ని
అని చెప్పారన్నమాట. 192వ పుటలో 7-6-30వ శ్లోక భాష్యానువాదములో ఇచ్చిన
వివరణ వలన మరణ సమయంలో ఇంద్రియ సముదాయం వ్యగ్రంగా ఉంటుందని, ఆ సమ
యంలో కూడా పరమాత్మను తెలుసుకొన్నవారు సమాహితమైన (ఆత్మరూపుడగు ఈశ్వరుని
యందు విలీనమైన) చిత్తము గలవారై ఉంటారని గ్రహించుటకు వీలుగా ఉండును.

(29) 193వ పుటలో 8-6-3వ శ్లోక భాష్యానువాదంలో "పరమ (సర్వకారణము, సర్వోత్కృష్టము నిర్గుణము)" అని 'పరమ' అనే శబ్దమునకు చక్కని నిర్వచనమును వ్రాసినారు. 195వ పుటలో 8-6-6వ శ్లోక భాష్యానువాదములో 'అనుభవమునుండి ఉత్పత్తి స్మరణమునకు కారణమైన సంస్కారమే భావన లేక భావము అనబడును' అని 'భావ' శబ్దమును అర్థవంతంగా నిర్వచించినారు. అట్లే 196వ పుటలో 8-6-8వ శ్లోక భాష్యానువాదంలో 'యోగి అభ్యాసచిత్తముతో సూర్యమండలాంతర్యామి యగు పురుషోత్తముని (సర్వ సంసార ధర్మముల నతిక్రమించి యున్న ఆత్మచైతన్య రూపముగా) ధ్యానించును' అని వ్రాసినారు. ఈ వివరణ వల్ల ధ్యానమెట్లా చేయవలెనో తెలియుచున్నది. అంతేకాక 'పరమాత్మ వెంకట విరూపం ఉపాస్య రూపంగా స్వీకరించబడినా ఉపాసక సాధకుడు అధిభూతములో ఒక అంశం ఒన కొలకు మాత్రము ఆ రూపం స్వీకరించబడినది, వాస్తవముగా ఆ ఉపాస్యదైవము సర్వసంసార ధర్మములను అతిక్రమించిన ఆత్మచైతన్యరూపమేయని గుర్తెఱుంగవలెను అనే హెచ్చరిక కూడా దీనిలో కలదు.

30) 197వ పుటలో 8-6-10వ శ్లోక భాష్యంలోని "పూర్వం హృదయపుండరీకే వశీకృత్య చిత్తమ్, తతః ఊర్ధ్వగామిన్యా నాడ్యా భూమిజయక్రమేణ భ్రువోః మధ్యే ప్రాణమ ఆవేశ్య స్థాపయిత్వా, సమ్యగ్ అప్రమత్తః సన్ సః ఏవం బుద్ధిమాన్ యోగీ" అనే వాక్యములను "ముందుగా చిత్తమును పద్మము వంటి హృదయకుహరమందు వశము చేసుకొని, భూమిని అంటే ఆసనమును, ఇంద్రియములను, మనస్సును వరుసగా జయించి అంటే వశము చేసుకొని, (లేదా భూమి-జలములు మొదలైన పంచభూతముల తత్త్వములను జయించి) తరువాత పైకి ప్రసరించే (సుషుమ్న) నాడితో కనుబొమల మధ్యయందు ప్రాణశక్తిని స్థాపించి, బాగుగా అంటే అసావధానత లేనివాడై అవివేక జ్ఞానముగల యోగి" అని వివరించినారు. మిగిలిన అనువాదములలోలేని స్పష్టత స్వామీజీ వారి అనువాదంలో ఉంది అని చెప్పుటకు ఈ భాష్యభాగానువాదము ఒక ఉదాహరణ. 'భూమిజయక్రమేణ' అనుచోట ఒక అనువాదంలో భూమిజయక్రమముతో అని మాత్రము ఉండగా, భూమ్యాది భూతాలను క్రమంగా జయిస్తూ అని మరొక అనువాదంలో ఉంది. కాని స్వామీజీ సాధకులకు ప్రధానమైన (ధ్యానమునకు ప్రధానమైన) ఆసన, ఇంద్రియ, మనస్సులను వశములోనికి తెచ్చుకొనుటను వ్రాసి రెండవ పక్షముగా 'లేదా భూమి-జలములు మొదలైన పంచభూతముల తత్త్వములను జయించి" అని వ్రాసినారు. దీనిలో కూడ భూతజయము అంటే ఆయా తత్త్వములను జయించుట అని చెప్పినారు. అట్లే 'సమ్యగ్ అప్రమత్తః' అనే పదమును 'అసావధానత లేనివాడై' అని 'బుద్ధిమాన్' అనే పదమును 'వివేకజ్ఞానము కలవాడు' అని అనువదించుట గమనార్హము. 'బుద్ధిమాన్' అనే పదమును ఒక అనువాదంలో విద్వాంసుడు అని మరో అనువాదంలో బుద్ధిమంతుడు అని ఆయా రచయితలు అనువాదం చేశారు. స్వామీజీ మాత్రము యోగియైనవానికి వివేకముగల బుద్ధికల్గియుండుట ప్రధానమని తెలియచేయుచూ అనువాదం చేసినారు.

(31) 212వ పుటలో 9-6-5వ శ్లోక భాష్యంలోని 'యుక్తిం' అనే పదాన్ని 'యుక్తి (యోజన శక్తి, వాస్తవముగాలేని జగత్తును తనయందు ప్రకటించుట)ని' అనియు, ఘటన (వాస్తవముకాని సకల భేదములను ఘటిల్లచేయుట)ను' అని 'ఘటన' అనే పదమును వివరించినారు. కాని ఒక తెలుగు అనువాదంలో రెండింటికీ కలిపి 'నా మాయాస్వరూపమును' అనేమాటతోటి, మరొక అనువాదములో 'యుక్తిని, ఘటనను' అని అవే పదములతోటి చెప్పినారు.

స్వామీజీ వారి వివరణ వల్ల 'జగత్తు వాస్తవంగా లేదని, ఆత్మసత్తతో అది ప్రకట మైనది అని, భేదములు కన్పడునవే కాని వాస్తవములు కావని తెలుసుకొనుటకు వీలుపడును. అట్లే 'నేను ప్రాణులయందు (యథార్థముగా ఒక ద్రవ్యము మరొక ద్రవ్యమునందు వలె) లేను', "అసంగ-ఆత్మ ప్రాణులయందు (ఆధారాధేయ భావముతో) ఉండుట అసంగతమగును" అని 'నచభూతస్థో యథోక్తేన న్యాయేన దర్శితత్వాద్ భూతస్థత్వానుపపత్తేః' అన్న భాష్యపంక్తులను అనువదించినారు. ఇక్కడ కూడా మిగిలిన అనువాదములలో 'నేను భూతములలో లేను పైన చెప్పబడిన న్యాయం వల్ల పరమాత్మకు భూతస్థత్వం కుదరదు' అని మాత్రమే ఉన్నది. కాని స్వామీజీ వారు పరమాత్మ భూతములందు ఏవిధముగా ఉండదో చక్కగా తెలుపుడు చేసినారు. 'మమ ఆత్మా'. నా ఆత్మ అని భగవానుడు అనుట హేతువేమి? అనుచోట ఈ ప్రశ్న ఉత్పన్నమగుటకు కారణమును కూడా చూపినారు: 'నేను ఆత్మ వేరు కాదు గదా!' అను వివరణచే. అంటే భగవానుడు ఆత్మ వేరు వేరు వ్యక్తులు కారు కదా నాకంటె వేరైన దాన్ని చెప్పినప్పుడే 'నాది' (మమ) అనటానికి కుదురుతుంది వేరు కాని దానికి అలా కుదరదు కదా! అట్టిచో భగవానుడు నా ఆత్మ అని ఎందుకు అన్నాడు? అనే ప్రశ్నకు హేతువు కూడా చక్కగా చెప్పినారు స్వామీజీ.

(32) 217 వ పుటలో 9-6-12 వ శ్లోక భాష్యంలో గల "ఛింధి భింధి పిబ ఖాద పరస్వమ్ అపహర ఇతి ఏవం వదనశీలాః క్రూరకర్మాణో భవంతి ఇత్యర్థః" అనే పంక్తులలో శంకరులు రాక్షస, ఆసుర, మోహాకర ప్రకృతులు కలవారి మాటలను వ్రాసినారు. ఇచ్చట వ్యాఖ్యాతలలో కొందరు ఈ పదములకు అర్థము వ్రాసి రాక్షస, ఆసుర స్వభావము అంటే హింసను కల్గించే స్వభావాన్ని కల్గి ఉండి నరుకుము, త్రాగుము మొదలైన మాటలను పలికే స్వభావాన్ని కల్గి ఉంటారని', కొందరు రాక్షస, ఆసుర, మోహాకర స్వభావములను నిర్వచించి వీనిలో ఆయా మాటలను ఆయా స్వభావము కలవారి మాటలుగా వేరుపరచి, మరి కొందరు రాక్షస, ఆసుర ప్రకృతులు రెండూ మోహాకరములే కాన రెండు ప్రకృతులు కలవారివే పేర్కొని ఈ మాటలను ఆ రెండు ప్రకృతులు గలవారిలో విభాగించి చూపినారు స్వామీజీ మాత్రము సువ్యవస్థ చేయుచూ రాజస, తామస స్వభావములను గూర్చి భగవానుడు గీతలో ముందు వెనుక చెప్పిన మాటలకు భంగం కలుగకుండా మూడు స్వభావములకు సంబంధించిన పదములను విభాగించి చూపినారు. ఎట్లనగా "కోసివేయుము, పగులగొట్టుము (రాక్షస ప్రకృతి, రాజసము), త్రాగుము, తినుము (ఆసుర ప్రకృతి, తామసము), ఇతరుల సొత్తును అపహరించుము (మోహము)" అని విభాగము చేసి చూపినారు.

(33) 228 వ పుటలో 34 వ శ్లోక భాష్యంలో గల "తం మామ్ ఏవం భూతం ఏష్యసి ఇతి అతీతేన పదేన సంబంధః' అనే వాక్యమును 'ఆత్మానం' అనే పదమును అంతకుముందు గడచిపోయిన ఏష్యసి అనే పదముతో కలిపి అన్వయించవలెను. (అంటే ఆత్మానం మామ్ ఏష్యసి, ఆత్మరూపుడనగు నన్ను చేరుకొనెదవు అని అర్థము. ఆత్మానం యుక్త్వా అని అన్వయము కాదు)' అని సంశయమునకు తావులేనట్లు వివరించినారు.

(34) 232 వ పుటలో 10-6-8 శ్లో భాష్యంలోని 'భావనా పరమార్థతత్త్వాభినివేశః' అన్న మాటను "భావము అంటే పరమార్థమైన తత్త్వము (ఆత్మస్వరూపము) నందు అభినివేశము (ప్రేమ, ఆదరము, దృఢమగు నిశ్చయము)' అని స్వామీజీ ఆ మాట యొక్క వాస్తవమైన అర్థము సాధకుని మనస్సులో స్థిరపడే రీతిలో వివరించినారు.

(35) 238 వ పుటలో 10-6-22 వ శ్లోక భాష్యంలో కల "భూతానామ్ అస్మి చేతనా కార్యకరణ సంఘాతే నిత్యాభివ్యక్తా బుద్ధివృత్తిః చేతనా." అనే వాక్యములను 'ప్రాణులయొక్క చేతన,

అంటే దేహము- ఇంద్రియముల సముదాయమందు సర్వదా ప్రకటమవుతూ ఉండే (చైతన్య ప్రతిఫలనముతో కూడియున్న) బుద్ధివృత్తి (విషయములను తెలుసుకొనే శక్తి) నేనే' అని 'చేతన' శబ్దము యొక్క అర్థము మనోహృదయములలో నాటుకొనునట్లు వివరించినారు. ఇదే శ్లోక భాష్యంలో ఇంతకంటే పూర్వము వచ్చిన "ఇంద్రియాణాం ఏకాదశానాం చక్షురాదీనాం మనః చ అస్మి, సంకల్ప వికల్పాత్మకం మనః చ అస్మి" అనే వాక్యమునకు 'కన్ను-చెవి మొదలైన (జ్ఞాన-కర్మ) ఇంద్రియములు (మనస్సుతో సహా) పదకొండు. వాటిలో సంకల్పములు- వికల్పముల రూపంలో ఉండే మనస్సు నేనే. (ఇంద్రియ వ్యాపారములన్నీ మనః పూర్వకములు గనుక మనస్సు గొప్పది)' అని పరమేశ్వర విభూతి మనస్సుగా ప్రకటమగుటకు హేతుబద్ధమైన వివరణను ఇచ్చినారు స్వామీజీ.

(30) 242 వ పుట 10-6-34 శ్లోక భాష్యంలోని "కీర్తిః శ్రీః వాక్ చ నారీణాం స్మృతిః మేధా ధృతిః క్షమా ఇతి ఏతాః ఉత్తమాః స్త్రీణాం అహం అస్మి" అను వాక్యమును స్వామీజీ 'స్త్రీలలో కీర్తి, శ్రీ (శోభ), వాక్కు, స్మృతి, మేధ, ధృతి (ధైర్యము), క్షమ అనే ఈ ఉత్తమ స్త్రీమూర్తులు (ఆయా భావములకు అధిష్ఠాన దేవతలు) నేనే అగుదును" అని అనువాదం చేసినారు. దీనివల్ల ఆయా ఉత్తమ స్త్రీలు నేనే అంటే స్త్రీలింగ శబ్దముల చేత చెప్పబడిన ఆ ఉత్తమ భావములకు గల అధిష్ఠాన దేవతలు నాకంటే భిన్నమైన స్వరూపము కలవారు కారు అని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

(31) 262 వ పుటలో గల 11-6-37 వ శ్లోక భాష్యంలోని 'సత్ అసత్ విద్యమానం అసత్ చ యత్ర నాస్తి ఇతి బుద్ధిః' అనే పంక్తిని 'ఉంటున్నది (వర్తమానకాలము చే సూచితమైన జగత్తు), లేనిది దేని విషయమునందు లేదు అనే బుద్ధి కలుగునో, అది (భూత భవిష్యత్తులకు చెందిన జగత్తు) అసత్. లేదా వ్యావహారిక జగత్తు సత్, ప్రాతిభాసికము (స్వప్నాది) అసత్. లేదా స్థూలమైన కార్యము సత్, సూక్ష్మమైన కారణము అసత్" అని వివరించి తర్వాత వచ్చిన 'తే ఉపధానభూతే సదసతీ యస్య అక్షరస్య' అనే భాష్య పంక్తిని అనువదించే సందర్భములో ఉపాధి శబ్దమును 'ఉపాధి (సామీప్యము చే తన ధర్మమును సంక్రమింప జేసినదా, అంటే అంటగట్టినదా, అన్నట్లు భాసించేది' అని నిర్వచించినారు.

32) 275 వ పుటలో 12-6-4 వ శ్లోక భాష్యానువాదంలో "అభీష్టము సిద్ధించినా, సిద్ధించకున్నా సమానమైన స్పందన (క్రమముగా హర్ష విషాదములు లేకుండుట) గలవారు" అని అంటే అభీష్టసిద్ధియందు హర్షస్పందన, అభీష్టము యొక్క అసిద్ధియందు విషాదస్పందన లేనివారు- అంటే వారికి ఒకదానియందు ఇది ఇష్టము అని మరొకదానియందు ఇది అనిష్టము అనే బుద్ధి ఉండదు. దీనినే దీనిపై వాక్యములో 'సకలకాలములయందు సమమయిన బుద్ధి గలవారు' అని చెప్పారు. కాబట్టి అది హర్షము ఇది విషాదము అనే భేదయుక్తమయిన స్పందన ఉండదు అని చెప్పినారు స్వామీజీ. అంతే కాక ఈ శ్లోక భాష్యానువాదంలోనే తరువాత "భగవత్స్వరూపులైన జ్ఞానుల గురించి వారు (కర్మయోగులవలె యుక్తులని గాని), (విశ్వరూపోపాసకులవలె) యుక్తతములు (యోగులలో ఉత్తములు) అనిగాని, యుక్తతములు కారని గాని చెప్పవలసినది లేదు" అని వ్రాసినారు. దీని వలన కర్మయోగులకంటే విశ్వరూపోపాసకుల యొక్క ఉత్తమత్వము చెప్పుట ద్వారా కర్మ కంటే ఉపాసన అది కూడా ఏదో ఒక దేవతోపాసన కాకుండా విశ్వమునందు మహాత్మను ఉపాసించుటను ఉత్తమమయిన జ్ఞాన సాధనముగా చెప్పినట్లయినది.

(33) 277 వ పుటలో 12-6-10 వ శ్లోక భాష్యంలో గల 'మత్కర్మ ప్రధానః' అనే పదమునకు 'కేవలము (ఫలాసక్తి, అభిమానము లేకుండా) నాకొరకైన కర్మలను మాత్రమే చేస్తూ ఉన్నవాడు' అని వివరణను ఇచ్చుట ద్వారా కర్మ ఏదైనను, ఎవరికొరకు చేసినా ఫలాసక్తి, అభిమానము ఉండరాదని నొక్కి చెప్పినట్లయినది.

(40) 282వ పుటలో 12-8-16వ శ్లోక భాష్యం లోని "శుచిః బాహ్యేన ఆభ్యంతరేణ చ శౌచేన సంపన్నః" అనే వాక్యానికి "శుచి అంటే బాహ్యమైన (పరిసరములు, వస్త్రములు, దేహములు ఇత్యాది), మరియు అంతరమైన (మనస్సు) శౌచముతో సంపన్నమైన వాడు" అని అర్థము చెప్పినారు స్వామీజీ. దీనిలో బాహ్యమైన శౌచమును చెప్తూ పరిసరములు, వస్త్రములు, దేహము శుద్ధిగా ఉండాలి అని చెప్పుటలో మనస్సు పవిత్రమైన భావములతో ఉంటే చాలు కదా! పరిసరములు, వస్త్రములు, దేహము ఎలా ఉంటే నేమి? అనే నిర్లక్ష్య భావము సాధకులకు ఉండరాదు. అట్టి నిర్లక్ష్యము సోమరితనమునకు దారి తీస్తుంది అనే హెచ్చరిక ఇమిడి ఉంది.

(41) 13-8-2వ శ్లోకమునకు శంకరులు అత్యంత విపులముగా భాష్యమును వ్రాసినారు. దానిని స్వామీజీ వారు అనువదించిన తీరు సాధకులకు చాల ఉపయోగకరముగా సంశయ విచ్ఛేదకముగా చాల స్పష్టముగా నున్నది. 308వ పుటలో 13-6-10వ శ్లోకము యొక్క భాష్యము యొక్క అనువాదము కూడా సాధకులకు చాల ఉపయోగకారి. అంతేకాక స్వామీజీ భాష్యంలోని అన్ని మాటలను అక్షరశః దృష్టిలో ఉంచుకొని అనువదిస్తారు అనునది విదితమే. ఉదాహరణకు ఈ శ్లోక భాష్యంలోనే వచ్చిన 'వివిక్తేషు హి దేశేషు చిత్తం ప్రసీదతి' అను పంక్తిని "పవిత్ర నిర్జన స్థానములయందు చిత్తము నిశ్చయముగా ప్రసన్నమగును." అని వివరించినారు. దీనిలో 'హి' అనగా నిశ్చయముగా అని అర్థము చెప్పినారు. ఈవిధముగా 'తు' 'చ' తప్పకుండా భాష్యానువాదం చేశారు స్వామీజీ.

(42) 13-8-12వ శ్లోక భాష్యములోని (313వ పుటలో గల) 'న తు బ్రహ్మ జాతిమత్. అతో న సదాది శబ్ద వాచ్యమ్' అనే వాక్యమును 'బ్రహ్మమైతే జాతిగలది కాదు. కావున (కుండ ఇత్యాది పదార్థములవలె బ్రహ్మ సత్తాజాతికి చెందినది కాదు గావున) ఉన్నది అనే పదము, అదే విధముగా అసత్ (ఉన్నది కాదు, అసత్త్వజాతికి చెందినది) అనే పదము బ్రహ్మను నిర్దేశించలేవు' అని వివరించినారు. దీనివల్ల సత్తాజాతికి అసత్త్వజాతికి కల భేదము, బ్రహ్మ యొక్క జాతిమదతీతత్వము తెలియుచున్నది.

(43) 325వ పుటలో గల 13-8-22వ శ్లోక భాష్యములోని 'అనుమంతా చ' అనే దానిని ద్వివిధాలుగా శంకరులు వివరించిన భాష్య భాగమును స్వామీజీ చాల సూక్ష్మమైన, సునిశితమైన పరిశీలనతో అనువదించినారు. 'అనుమోదనమ్ అనుమననం కుర్వంస్తత్క్రియాసు పరితోషః' అనే వాక్యమునకు 'కొందరు ఆయా పనులు చేస్తుండగా ఆయా పనుల విషయంలో 'సంతోషం' అని ఎవరో మనుష్యులు చేస్తున్న పనుల విషయంలో సంతోషించేవాడు అని ఒక అనువాదకులు వ్రాశారు. కాని స్వామీజీ దీనిని "అనుమోదనమనగా ఇంద్రియాదుల క్రియలను చేస్తూ ఉంటే ఆ క్రియల విషయంపై సంతోషము. అట్టి అనుమోదనమును (సన్నిధి మాత్రముచే) చేసేది అనుమంత అనబడును. (ఆత్మ తాను నిత్యతృప్తమై ఇంద్రియ వ్యాపారములయెడ తృప్తుడా యున్నట్లు భావించబడును" అని సమగ్రమైన వివరణతో అనువాదం చేసినారు. 'అథవా అనుమంతా కార్యకరణప్రవృత్తిషు స్వయం అప్రవృత్తోऽపి ప్రవృత్త ఇవ తదనుకూలో విభావ్యతే తేన అనుమంతా' అనే భాష్య వాక్యమును 'దేహము, ఇంద్రియముల యొక్క చేష్టలందు తాను స్వయముగా చేష్ట చేయకున్ననూ వాటికి అనుకూలమై చేష్టకలది వలె కానవచ్చుట చేత (ప్రత్యగాత్మ) అనుమంత యనబడును' అని అనువదించారు. ఇక 'అథవా ప్రవృత్తాన్ స్వవ్యాపారేషు తత్సాక్షిభూతః కదాచిదపి న నివారయతి' అనే భాగమునకు కొందరు 'తమ తమ పనులు చేయడానికి ఉద్యుక్తులైన వాళ్లని, తాను సాక్షిమాత్రంగానే ఉంటూ, ఎప్పుడూ నివారించడు కావున అనుమంత' అని అనువాదము వ్రాయగా స్వామీజీ 'ప్రత్యగాత్మ తత్త్వాన్ని ఒక్కసారిగా అందచేయుచున్నట్లు "తమ చేష్టలయందు ప్రవర్తిల్లుచున్న దేహాదులను వాటికి సాక్షియై ఉండి ఎప్పుడైననూ నివారించడు (ప్రేరేపించడు) గనుక ప్రత్యగాత్మ అనుమంత" అని వ్రాసినారు. దీనివల్ల అర్థమంతయూ అధ్యాత్మమందు సమన్వయించును. అట్లు కాకపోతే అనువాదకులు చెప్పినట్లు చెప్పినచో పనులయందు ప్రవర్తించువ్యక్తి వేరు ఆపనులకు సాక్షియైన అనుమంతయైనవాడు వేరు అనే ద్వైత భావన సాధకులకు కలిగే ప్రమాదముకలదు.

(44). 325వ పుటలోని 13-6-22వ శ్లోక భాష్యం లో గల "భర్తా" ఇత్యాది భాష్య వాక్యము పై అను
వాదం చేయుచూ స్వామీజీ '(దేహాదులకు సత్తా స్ఫూర్తులను గ్రహించి వాటిని స్వరూపము
గలవిగా చేసేది ఆత్మచైతన్యమే)' అని వ్రాసిన వివరణవల్ల ఆత్మచైతన్యం లేకపోతే
దేహాదులకు ఉనికియే లేదు అని చెప్పుట ద్వారా ఆత్మచైతన్య సత్తలో దేహాదులు
భాసించేవే తప్ప వాస్తవమైన ఉనికి ఉన్నవి కావు అనే సత్యాన్ని మరొక్క మారు జ్ఞాపకం చేసి
నట్లు యినది.

(45) 344వ పుటలోని 14-6-7వ శ్లోక భాష్యం లోని "రజో రాగాత్మకమే, రంజనాత్ రాగో గైరికాది
వత్. రాగాత్మకం విద్ధి జానీహి" అనే వాక్యమునకు స్వామీజీ "రజోగుణము రాగమే
స్వరూపంగా గలది. రంజింపచేసేది రాగము. ఏ విధముగానైతే గైరికము, శిలాజిత్తు మొదలైన
రంగురాళ్ల రంగు స్వచ్ఛమైన వస్త్రమునకు రంగుపట్టించి రంగుగలదిగా చేస్తుందో, అదే విధముగా
విషయములందలి రాగము (ఆసక్తి) మనస్సును రంగు వస్త్రమువలె మలినముగా చేయును. రజో
గుణము అట్టి రాగము స్వరూపముగా గలది అని తెలుసుకో" అని చాల చక్కని వివరణం ఇచ్చి
నారు.

(46) 351వ పుటలోని 14-6-22వ శ్లోక భాష్యం లోని 'ఏతత్ న పరప్రత్యయలింగమ్' అనే వాక్యానికి
'ఈ గుణము (ప్రవృత్తమైతే ద్వేషము, నివృత్తమైతే ఆకాంక్ష లేకుండుట) ఇతరులకు తెలిసేది
కాదు' అని వివరణ ఇచ్చినారు. దీనివల్ల బుద్ధి విషయములయందు ప్రవృత్తమైనప్పుడు
ఆ విషయ ప్రాప్తి లేకపోతే ద్వేషము (ఒకప్పుడు ఆ విషయం ప్రాప్తిస్తే రాగము, రాగద్వేషములు
రెండూ తత్త్వావగతికి అడ్డంకులే కనుక), విషయములనుండి నివృత్తమయితే కోరికలేని స్థితి
ఉంటుంది. అని గ్రహించవలెను.

(47) 359వ పుటలో 15-6-3వ శ్లోక భాష్యం లోని 'న ఇహ ఉపలభ్యతే' అనే దానికి 'ఉపలబ్ధ
మగుటనే (స్థిరముగా అనుభవమునకు వచ్చుట) లేదు' అని, "న అంతో న పర్యంతో నిష్ఠా సమాప్తిః
వా విద్యతే" అను భాష్యపంక్తికి 'దీనికి అంతము లేదు అంటే ఇది దీనియందు సమాప్తమగును
అనే లక్ష్యము గాని, ఇంతవరకు ఇది కొనసాగును అనే అవధిగాని దీనికి లేవు. ఇది (అజ్ఞానము
ఉన్నంతవరకు) సమాప్తము అయ్యేది కాదు" అనియు, అట్లే 'సువిరూఢమూలమ్' అనే పదమునకు
'గట్టిగా పాదుకొని యున్న వ్రేళ్లు (రాగద్వేషాది వాసనలు) గలది' యనియు చెప్పిన వివరణము
సాధకులకు చాల ఉపయోగకరము.

(48) 367వ పుటలో 15-6-15వ శ్లోక భాష్యం లోని "సర్వప్రాణిజాతస్య అహం ఆత్మా సన్ హృది
బుద్ధౌ సన్నివిష్టః" అనే వాక్యమునకు 'సకల ప్రాణుల సముదాయమునకు నేను ఆత్మరూపుడనై
బుద్ధియందు చక్కగా (అంతర్యామినై, సకల బుద్ధి ప్రత్యయ సాక్షినై) నిలిచియున్నాను' అని
వివరణ వ్రాసినారు స్వామీజీ. దీనివలన పరమాత్మ బుద్ధియందుండుట యనగానేమో
తెలియుచున్నది.

(49) 378వ పుటలో 16-6-2వ శ్లోకము యొక్క భాష్యం లోని 'హ్రీః లజ్జా' అను మాటను
'హ్రీ, అంటే సిగ్గు (తప్పు పని చేయాలంటే కలిగే సిగ్గు, తన పొగడ్త వినాలంటే సిగ్గుపడుట)'
అని వ్రాసినారు. దీనివలన దైవీ సంపదను పెంపొందించుకొనే యత్నం చేసే సాధకులు
ఎట్టి తప్పు చేయకుండుటకు, పొగడ్తలు వినని చ్ఛగించకుండా ఉండేందుకు యత్నము చేయు
వలెను. అంటే ఈ గుణములు అలవరచుకొనవలెనను విషయము తెలియుచున్నది.

(50) 377వ పుటలో 16-6-8వ శ్లోక భాష్యం లో గల 'యథా వయమ్ అనృత ప్రాయాః తథా ఇదం
జగత్ సర్వం అసత్యం' అనే భాష్యపంక్తిని స్వామీజీ "మనమెట్లాగైతే అసత్యముతోనిండి
ఉన్నామో (అంటే నటించే వేషమే తప్ప జీవుడనే వాడు లేడు) అదేవిధముగా ఈ జగత్తంత
యు అసత్యము (దీని మూలమునందు దేవుడు లేడు)" అని వివరించినారు. దీనివల్ల ఈ శ్లోకం
లో వివరింపబడిన నాస్తిక వాదుల సిద్ధాంతం స్పష్టంగా అర్థమవుతున్నది. అంతే కాక
'అపరస్పర సంభూతమ్' ఇత్యాది భాష్యపంక్తిని "అపరస్పర సంభూతము. కామమచే ప్రేరితులైన
(అపర) స్త్రీ మరియు (పర) పురుషుని యొక్క పరస్పరము కలయిక వలన సకల జగత్తు పుట్టినది" అని

వివరించినారు. 'అపరస్పర సంభూతం' అనే పదం యొక్క విగ్రహ వాక్యము గురించి, పద సాధు
త్వము గురించి, అర్థము ను గురించి పండితలోకంలో చాల చర్చ కలదు. కాని స్వామీజీ
ఆ చర్చల జోలికి వెళ్ళకుండా సాధకులకు అందరి తాత్పర్యం తెలియుటయే ముఖ్యం కాబట్టి
తగిన విధంగా వ్యవస్థ చేసి 'కామప్రయుక్తయోః స్త్రీపురుషయోః అన్యోన్యసంయోగాత్'
అన్న శంకరుల భాష్య వాక్యాన్ని చక్కగా అర్థము చేసుకొని అపర (స్త్రీ), పర (పురుష)
పరస్పర (అన్యోన్యమైన పరస్పరము కలయిక వలన) అని ఆ సమస్త పదము లోని పదాల
చేతనే వివరించినారు స్వామీజీ.

(51) 385 వ పుటలో 17-అ. ప్రారంభంలోని అవతారిక లోని 'తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే' అన్న
భాగాన్ని 'కావున నీకు కర్తవ్య–అకర్తవ్యముల వ్యవస్థను నిర్ధారించుట యందు (విధినిషేధ)
శాస్త్రము ప్రమాణము (తెలుసుకొనే ఉపాయము)' అని వ్రాసినారు. శాస్త్రము (వేదము) విధించిన
ఆ విధిని తెలుసుకొనేందుకు ఉపాయమో తెలుపుట ద్వారా తరువాత అర్జునుడు
వేయబోయే ప్రశ్నకు ఎలా అవకాశం కల్గినదో స్పష్టంగా తెలియుచున్నది ఈ వివరణ వల్ల.

(52) 389 వ పుటలో 17-అ-9 వ శ్లోకంలోని 'ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః'
అను పాదమునకు శంకరులు ఇచ్చిన భాష్యమును అనువదించుచూ స్వామీజీ రజో
గుణ ప్రధానునకు ప్రీతికరమైన ఆహారములు "శరీరమునకు (తత్కాలమున) పీడను,
(భవిష్యత్తునందు) మనస్సునకు శోకమును, (దేహమునకు) రోగమును కూడా కల్గిం
చును" అని వ్రాసినారు. ఈ అనువాదము వలన రజోగుణ ప్రధానునకు ఇష్టమగు
ఆహారములను సేవించుట ఎంత చేటో నికరముగా తెలుస్తున్నది.

53) 410 వ పుటలో 18-అ-12 వ శ్లోకభాష్యంలో కల 'మమ మేదాకరం' అను పదమునకు 'పెద్ద ప్రమో
హము (భోక్తృత్వము) ను కల్గించును' అనే అర్థమును వ్రాసినారు. అజ్ఞాన కల్పితమైన ఫలము
నందలి తృష్ణ చేతనే సహజముగా తాను భోక్త కాకున్నను భోక్తగా మారుచున్నాడు అని
దీని వలన తెలియుచున్నది. 'ఫల్గుతయా లయమ్ అదర్శనం గచ్ఛతి ఇతి ఫలమ్ ఇతి ఫల
నిర్వచనమ్' అనే ఫలనిర్వచనమును స్వామీజీ 'ఫలము సారహీనము (మిథ్యాభూతము)
అగుటచే (శీఘ్రముగా) కనపడకుండా పోవును' అని వివరించినారు. ఇక్కడ ఒకరచయిత
తమ అనువాదంలో 'ఫల్గు అనగా స్వల్పం అదృష్టం చేత లయమును పొందుతుంది. కనుక
కండావేతుంది గాన ఫలం' అని వ్రాసినారు. అయితే సందర్భాన్ని బట్టి స్వామీజీ వారి
వివరణమే సరిగానున్నది అని తెలుస్తున్నది. అంతియకాక 'అసారం ఫల్గు' అని 'అసారమైనది
'ఫల్గు' శబ్దంచే చెప్పబడునని, అమరంలో తెలుపబడినది. అచట వ్యాఖ్యాత కూడా
"ఫలతి శీఘ్రమేవ ఇతి ఫల్గు" 'ఞిఫలా విశరణే' శీఘ్రముగా నశించునది అని ఇచ్చినారు.
ఈ విధముగా పరిశీలించినచో స్వామీజీవారి వివరణమే సమీచీనముగానున్నదని
తెలియుచున్నది.

(54) 412 వ పుటలో 18-అ-14 వ శ్లోక భాష్యంలోని ప్రతిపదమును చాల బాగ రూపతలో
వివరించినారు. ముఖ్యంగా 'కరణం చ శ్రోత్రాదికం శబ్దాద్యుపలబ్ధయే పృథగ్విధం నానా
ప్రకారం ద్వాదశసంఖ్యం' అను దానిని స్వామీజీ "శబ్దము–రూపము మొదలగు
విషయములను తెలియుటకై చెవి–కన్ను మొదలైన పన్నెండు సంఖ్య (ఐదు కర్మేంద్రియ
ములు, ఐదు జ్ఞానేంద్రియములు, సంకల్ప ప్రధానమైన మనస్సు, నిశ్చయం ప్రధానమైన
బుద్ధి) గల అనేక ప్రకారములైన కరణము" అని వివరించినారు. ఈ వివరణ సాధకులకు
చాల ఉపయోగించును.

18 వ అధ్యాయంలో 48 వ శ్లోకమునకు శ్రీశంకర భగవత్పాదులు చాల పెద్దదైన
భాష్యం వ్రాసినారు దానిని స్వామీజీ వారు చాల చక్కగా అనువాదం చేసినారు. ఆ అను
వాదం జాగ్రత్తగా అవధానముతో చదివితే సాధకులకు ఆత్మను గురించి, కర్మలను
విడిచిపెట్టుట, నిర్వర్తించుట లను గురించి సాంఖ్యము, బౌద్ధము, వైశేషికము మొద

ద్వైత సిద్ధాంతముల లోని ప్రతిపాదనలు ఏమి కలవో అవి అన్నియు తెలుస్తాయి. వాటి నన్నింటిని శ్రీ శంకరుల యుక్తి యుక్తముగా, శాస్త్ర సమ్మతముగా, అనుభవము (సర్వుల) నకు తగినట్లుగా వివిధముగా త్రోసి పుచ్చి, భగవద్వచనమునకు తాత్పర్య భూతమైన అద్వైత వేదాంత సిద్ధాంతము వివిధముగా సత్యమైనదిగా నిరూపించినారో అవగతము కాగలదు.

ఈ గ్రంథమందు స్వామీజీ చే వ్రాయబడిన అనువాదములో అనుభవ ప్రధానంగా అనగా సాధకులు తమ అనుభవమునకు తెచ్చుకొని సరి చూసుకొనే విధముగా వివరించబడిన అనేక అంశములు కలవు. కాని ఈ సమీక్షా వ్యాసములో అన్నింటిని వివరించుట సాధ్యము కాదనియు, సాధకులు చదివి తమ స్వానుభవంలో సరి చూసుకొని మరిన్ని విశేషములను గ్రహించగలరనియు, ఆకాంక్షించుచూ ఈ వ్యాసమును ముగించడం జరిగింది.

ఈ గ్రంథములో క్వాచిత్కముగా ముద్రణా దోషములు కన్పించినవి. ఇంత పెద్ద గ్రంథములో కొన్ని అచ్చు తప్పులు ఉండటం అసహజం కాకపోయిననూ మరి ముద్రణలో జాగ్రత్త వహించుటకై ఒక పట్టికతో తప్పు ఒప్పులను సూచించడం జరిగినది. ఆ పట్టికను ఈ ప్రత్యేక పుటలో పొందుపరచడమైనది.

ఈ వ్యాసములో శ్రీమద్భగవద్గీతలోని 18 అధ్యాయములనుండి మొత్తము ఒక 54 అంశములను తీసుకొని వాటిని వివరించడం జరిగింది. ఆ అంశములలో కొన్నింటిలో మరి కొన్ని చిన్న అంశములను కూడా వివరించడం జరిగినది. ఇది ఈ గ్రంథం చదివే పాఠకులకు ఒక ప్రేరణగా ఉండగలదనే భావముతో స్వామీజీ వారికి నమస్కరించి ఈ వ్యాసం వ్రాయటం జరిగినది.